20-11-1998 శుక్రవారం 12 పేజీలు సంపుటి: 70 సంచిక: 47 విడిప్రతి రూ. 2.00లు Phone: 327354 Regd. No. HNL-18

# జమీన్ రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

బెడ్ షీట్ మేళా

ఖరూర్, జైపూర్, షోలాపూర్, మీరట్, ఈరోడ్, ఢిల్లీ మొదలగు కంపెనీల బెడ్‌షీట్స్ అత్యంత తగ్గింపు ధరలకే

సరికొత్త స్టాకు వచ్చినది

చందన

ట్రంక్ రోడ్ Ph. 323420.

All Credit Cards Accepted

# నిందలెందుకు, నిజమేదో తేల్చండి!

నెల్లూరులోని మునిసిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నదని ఒక దినపత్రిక వార్తా కథనాలు ప్రచురించడంతో అన్ని రాజకీయ పార్టీలూ మూకుమ్మడిగా ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డిపై దండయాత్ర ప్రారంభించాయి. ధర్నాలు, ఘెరావ్‌లు, పత్రికా ప్రకటనలు, విమర్శలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తెలుగుదేశం, బిజెపి, సిపిఎం తదితర పార్టీల నేతలందరూ రంగంలోకి దూకారు. ఒకే ఒక్క వారంలో మునిసిపల్ రాజకీయం వేడెక్కిపోయింది; ఉద్రిక్తతలు పెరిగాయి.

ఇళ్ల పన్నుల వసూలులో గోల్మాల్ జరిగిందన్నది ప్రధాన ఆరోపణ. బిల్లు కలెక్టర్లు గత నాలుగేళ్లలో దాదాపు నాలుగు కోట్ల రూపాయలు మునిసిపల్ ఖజానాలో జమ చేయకుండా స్వాహా చేసేశారని, ఇందులో ఛైర్మన్‌కూ భాగం వుందని ఆ

**నెల్లూరు మునిసిపాలిటీలో అవినీతిపై తక్షణ దర్యాప్తు జరిపించడం ప్రభుత్వ బాధ్యత!**

దినపత్రిక వ్రాసింది. ఇది పచ్చి అబద్ధమని ఛైర్మన్ ఆవేదన. సంవత్సరానికి ఇళ్ల పన్నుల ద్వారా మునిసిపాలిటీకి వసూలు కావలసిన మొత్తం రెండు కోట్లా 78 లక్షలు; ఈ ఏడాదిలో కోటి 38 లక్షలు దండారు. ఆ పద్దులో వసూలు కాకుండా మిగిలి వుండే మొత్తం కోటి 34 లక్షలు; నీళ్ల పన్నుకు సంబంధించి మరొక 85 లక్షలు బాకీ లున్నాయి. ఈ రెండు పద్దుల్లో పాత సంవత్సరాలకు సంబంధించి దాదాపు ఒకటిన్నర కోటి రూపాయలు బాకీలున్నాయి. దీనితో కలిపి మునిసిపాలిటీకి రావలసిన మొత్తం పన్నుల బాకీ 4 కోట్లవు తున్నది. రకరకాల కారణాల వల్ల బిల్లు కలెక్టర్లు వీటిని దండలేదని, అంతే తప్ప 4 కోట్లు స్వాహా అయ్యాయని నిందించడం అన్యాయ మని ఛైర్మన్ వాదిస్తున్నాడు.

స్వాహా మొత్తం 4 కోట్లు కాకపోవచ్చు గాని, అసలు స్వాహా జరగనే లేదనడం నిజం కాదు. నెల్లూరు బిల్లు కలెక్టర్లు గుడిని, గుడిలో లింగాన్ని కూడా దిగమ్రింగ గల సమర్థులు. దండిన ఇళ్ల పన్నులను తమ స్వంత వ్యసనాలకు, వ్యాపారాలకు మళ్లించడం వారికి అలవాటు. ఇంత కాలం వారిని ప్రశ్నించిన వారు లేరు. వారిపై ఛైర్మన్‌కు లేదా కౌన్సిలర్లకు అదుపు లేదు. కేవలం మునిసిపల్ కమీషనర్ మాత్రమే వారి పని తీరును సమీక్షించాలి. అయితే ఇళ్ల పన్నులు దండినదెంత, ఖజానాకు చెల్లించినదెంత అన్న వివరం తెలియాలంటే ఆడిటింగ్ తప్పనిసరి. లక్కల్లో వుండే బిల్లులు, రశీదులు చెక్‌చేసి, అవి ఖజానాకు జమ పడిందీ, లేనిదీ పరిశీలించడానికి ఆడిట్ తప్ప మార్గాంతరం లేదు. ఆడిట్ నిర్వహించ వలసింది రాష్ట్ర ప్రభుత్వం. హైదరాబాద్ నుంచి ప్రతి ఏటా ఆడిటర్లు వచ్చి లెక్కలు చూడాలి. కాని గత ఎనిమిదేళ్లుగా ఆడిట్ జరగలేదు. ఆ తప్పు ఛైర్మన్‌దో, కౌన్సిలర్లదో కాదు పూర్తిగా ప్రభుత్వానిది. ఒక్క నెల్లూరే కాదు - రాష్ట్రంలో ఎక్కడా, ఏ మునిసిపాలిటీలోనూ ఆడిట్ జరపలేదు ప్రభుత్వం. దాన్ని అలుసుగా తీసుకొని గత ఏడెనిమిదేళ్ల నుంచి బిల్లు కలెక్టర్లు బిల్లు పుస్తకాలు, రశీదులు తమ దగ్గరే పెట్టుకున్నారు. చట్టం ప్రకారం ఆడిటర్లకు తప్ప మరెవ్వరికీ - ఆ పుస్తకాలు చూపించ నవసరం లేదు కాబట్టి బిల్లు కలెక్టర్లు ఆడింది ఆట, పాడింది పాట అయ్యింది. 1990-91 సంవత్సరం లెక్కలపై 1998 మే నెలలో ఆడిటింగ్ జరిగిందంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందేదీ అర్థమౌతుంది.

ఇదీ ఈ గోల్మాల్ వ్యవహారపు నేపథ్యం. ఇందులో తన ప్రమేయం, తన పాత్ర లేవు కాబట్టే ఛైర్మన్ వివేకానందరెడ్డి తెలుగుదేశం, బిజెపి వంటి ప్రతిపక్షాల వారికంటే పెద్ద గొంతుతో దీనిపై విచారణ జరిపించమని అడుగుతున్నాడు. సాధారణంగా దర్యాప్తులు, విచారణలు అంటే రాజకీయవాదులు భయపడి పోతారు; అవి రాకుండా అడ్డం కొట్టడానికి నానాపాట్లు

తరువాయి 7వ పేజీలో

# జనానికి దూరమై పోతున్నాం -

నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ ప్రస్తుత స్థితిపై అధ్యయనం జరపడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన పార్టీ పరిశీలకుడు శ్రీ జి. సిద్దయ్య చాలా

* పరసా, వైఎస్ఆర్ ఎంతో బెటర్.
* సోమిరెడ్డి చెడగొట్టుకున్నాడు.
* లక్ష్మయ్యకు నోటి దురుసెక్కువ.
* నెల్లూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు వీక్.
* కోవూరు, గూడూరు ఎమ్మెల్యేలు హోప్‌లెస్.
* అల్లూరులో మంచి అవకాశాలు.

సవివరమైన నివేదిక తయారు చేశాడు. దాదాపు వారం రోజులు జిల్లాలోనే వుండి, అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలూ పర్యటించి, కొన్ని వందల మంది కార్యకర్తలతో మాట్లాడి మరీ ఈ నివేదిక సమర్పించారాయన. మొగమాటాలు, దాపరికాలు లేకుండా స్పష్టంగా, సూటిగా తాను చెప్పదల్చు కున్నది చెప్పేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరిక కూడా అదే కదా!

నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏ మాత్రం సంతృప్తికరంగా లేదని తేల్చి చెప్పాడు సిద్దయ్య. జిల్లాలో శాసన సభ్యుల మధ్య ఐక్యత లేదు; మంత్రులిద్దరి మధ్య సమన్వయం లేదు. పార్టీ అభివృద్ధి గురించి ఎవరూ పట్టించు కోవడం లేదు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా కార్యకర్తల బాగోగులు చూడడంలో ఎమ్మెల్యేలు విఫలమౌతున్నారు. కార్యకర్తలలో విపరీతమైన నిరాశా, నిస్పృహలున్నాయి. దీనితో పార్టీ జనానికి దూరమై పోతున్నది. కాంగ్రెస్ వాదులు, ఇతరులు చేసే విమర్శలను త్రిప్పికొట్టడంలో జిల్లా నేతలు శ్రద్ధ చూపడం లేదు. వాటికి సరైన రీతిలో సమాధానాలు చెప్పలేక పోతున్నారు. దానితో జనంలో పార్టీ పట్ల, పార్టీ నేతల పట్ల అపోహలు బలపడి పోతున్నాయి. జిల్లా నేతల వ్యవహార శైలి మారకుంటే ఎన్నికలకు పార్టీని సమాయత్తం

**తెలుగుదేశం పరిశీలకుడి నివేదిక!**

చేయడం చాలా కష్టం - అని నివేదించాడు సిద్దయ్య.

అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా కూడా ఆయన తన అంచనాలు వ్యక్తం చేశాడు. సూళ్లూరుపేటకు ఫస్ట్ మార్క్ ఇచ్చాడాయన. పరసారత్నం చాలా సమర్థవంతంగా పార్టీని నడిపిస్తున్నాడని; వివాదాల జోలికి వెళ్లకుండా, అనవసరపు రచ్చలు, ఆగాలు చేయకుండా చాపక్రింద నీరు వలె పనిచేసుకు పోతున్నాడని ప్రశంసించాడు పరిశీలకుడు. తర్వాత ఈ స్థాయిలో పరిశీలకుడి మెప్పు పొందింది - రాపూరు ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి ఒక్కడే. ఎమ్మెల్యేగా ఎల్లసిరి చాలా బాగా పనిచేస్తున్నాడని; అయితే రాపూరు నియోజక వర్గంలోని బిసిలు, ఇతర కులాల వారిలో మాత్రం కొంచెం అసంతృప్తి కన్పిస్తున్నదని; దానిని సరిదిద్దుకుంటే రేపటి ఎన్నికల్లో ఈ స్థానం చాలా సునాయాసంగా గెల్చుకో గల్గుతామని నివేదించా డాయన. ఎల్లసిరిని తప్పించి తమకు టిక్కెట్లు ఇవ్వమని అడిగేవారి సంఖ్య కూడా చాలా అధికంగా వుందని ముఖ్యమంత్రికి చెప్పాడట ఆయన. ఎమ్మెల్యే ఎంతో బాగా పనిచేస్తున్నాడంటూనే ఈ మెలిక ఏమిటో మరి!

# జాగ్రత్త పడకుంటే గోవిందే!

నెల్లూరు, గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలను తీసి ప్రక్కన పారేశాడు సిద్దయ్య. నెల్లూరు ఎమ్మెల్యే రమేష్‌రెడ్డికి క్యాడర్ లేదు; పార్టీ కార్యకర్తలంతా ఆయన్ను వదలి వెళ్లిపోయారు. దానితో పార్టీ బాగా బలహీన పడిపోయి వుంది. ఇప్పటి నుంచి పట్టుదలగా, అహోరాత్రులు కృషి చేసి, క్యాడర్‌ను పెంచుకొంటే తప్ప రేపటి ఎన్నికల్లో పార్టీ పరిస్థితి మెరుగుపడదు అని అభిప్రాయపడ్డా రాయన.

వెంకటగిరి ఎమ్మెల్యే యాచేంద్ర శుద్ధ దండగ; ఆయనలో ఆవాహన, విసర్జన రెండూ లేవు; కార్యకర్తలకు ఆయనంటే కంపరం; ఆయనకు కార్యకర్తలతో కలిసి తిరగడం చేత కాదు. వెరసి పార్టీ దాదాపు దివాలా తీసే స్థితిలో పడిపోయింది. అర్జెంట్‌గా ఆయన్ను ప్రక్కకు తప్పించి, ఎవరో ఒక కొత్త నేతను తయారు చేసి, బాధ్యత అప్పచెప్పకుంటే రేపటి ఎన్నికల్లో ఈ నియోజక వర్గంలో అభ్యర్థిని నిలబెట్టడమే

తరువాయి 7వ పేజీలో

# ధరలు ఇలాగే ఉంటే పరిశ్రమల మూత!

బిజినెస్ న్యూస్

డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్

నిత్యావసర వస్తువులైన కందిపప్పు, మిరపకాయలు, ఉల్లిపాయలు, నూనె, ఉప్పుధరలు ఆకాశానికి అంటాయి. తిండికి అవసరమైన వస్తువుల ధరలన్నీ విపరీతంగా పెరిగి పోవడంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు అల్లాడి పోతున్నారు. ధరలు ఏ మాత్రం తగ్గక ఇదేవిధంగా వుంటే పారిశ్రామిక వినియోగ వస్తువుల జాబితాలోనికి వచ్చే సబ్బులు, క్రీములు, పౌడర్లు, విలాస వస్తువులైన టివి, రెడియో, వాషింగ్ మిషన్, ఫ్రిజ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను మధ్యతరగతియులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితి పారిశ్రామిక మాంద్యానికి దారితీస్తుంది.

ప్రధాని వాజ్‌పేయి ఈ వారంలో ప్రకటించిన భారీ ప్యాకేజి 15 రోజుల్లో ఆశించినంత ఫలితాలు సాధించకుంటే పరిస్థితులు విషమించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. వాజ్‌పేయి ప్రకటించిన వాటిలో మెగా విద్యుత్ ప్రాజెక్టులు, భూసేకరణ పథకానికి సవరణలు, దివాలా తీసిన 12 ప్రభుత్వ రంగ సంస్థలలోని వుద్యోగుల స్వచ్ఛంద పదవీ విరమణ పథకం, 75వేల కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం, పప్పు ధాన్యాలపైన దిగుమతి పన్ను రద్దు, వంట నూనెలపై కస్టమ్ డ్యూటీ మినహాయింపు, ఉల్లిపాయల దిగుమతి, స్టాక్ మార్కెట్‌కు సంబంధించి బైబ్యాక్ విధానం వున్నాయి. ప్రధాని అమలు చేస్తానన్న ఈ విధానాలన్నీ సహేతుకమైనవే, కాని వీటిని అమలు చేయడానికి కావలసిన నిధులున్నవా? వీటిని అనువర్తింప జేసే శక్తి ఈ ప్రభుత్వానికున్నదా అనే సందేహాలు కలుగుతున్నాయి.

దేశంలో ఈసారి ఖరీఫ్ కాలం పంటలు బాగా దెబ్బతిన్నాయి. రబీ కాలంలోనైనా పంటలు బాగా పండకపోతే పరిస్థితి ఇంకా క్షీణించి, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగే సూచనలున్నాయి. ఉదాహరణకు మనదేశంలో వంట నూనెల ఉత్పత్తి 68 లక్షల టన్నులు కాగా, వినియోగం 82 లక్షల టన్నులు. డిమాండ్ సప్లయ్‌ల మధ్య 14 లక్షల టన్నుల భేదం నూనె రేట్లు పెంచేట్లు చేస్తుంది. ఏదైన ఉపద్రవాలు ఎదురై ఉల్లిపాయలు, కాయగూరలు, నూనెలు, కందిపప్పు, మినపప్పు పంటలు దెబ్బతింటే దేశంలో పరిస్థితులు ఏ విధంగా ఉంటాయన్నది ఊహించడం కష్టం. ధరలు ఇంతగా పెరిగినా ద్రవ్యోల్బణం రేటు 8 శాతంగానే వుంది. కూరగాయల ధరలు 150 నుంచి 200 శాతం, ప్రాథమిక వస్తువుల ధరలు 25 శాతం వున్నా ద్రవ్యోల్బణం తక్కువగా వుండడం వాశ్చర్యమనాలి.

ప్రధాని విధాన ప్రకటనలు ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకొని వెళ్లలేవు. వాస్తవిక కార్యాచరణ ముఖ్యమని బిజెపి ప్రభుత్వంలోని బాధ్యులు భావించి అందుకు అనుగుణ్యంగా ముందుకు కదలాలి. *

# వచ్చే ఏడాది నుంచే మహా ఆర్థిక మాంద్యం!

1929-33 సంవత్సరాల మధ్య ప్రపంచ దేశాలన్నింటిని కుదిపేసిన మహా ఆర్థిక మాంద్యం, మళ్లీ పునరావృతమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లోని స్టాక్ మార్కెట్లలో గందరగోళం, ఈ మహా మాంద్యానికి ప్రాథమిక సూచనలిస్తుందనవచ్చు. టెక్నాలజీకి మారుపేరైన జపాన్‌లో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టేందుకు, ఆ దేశ కొత్త ప్రధాని, అమెరికా ఆర్థికవేత్తలు, ప్రపంచ ఆర్థిక సంస్థకు చెందిన ప్రముఖులు చేసిన ప్రయత్నాలు, ఏ మాత్రం ఫలితాలివ్వ లేదు. ఒకప్పటి కమ్యూనిస్టుల కోటైన రష్యాలో గత పదేళ్లుగా కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ, నేడు మరణదశలో వుందనాలి. ఇప్పటి వరకు రష్యా స్థూల జాతీయోత్పత్తి రేటు 75 శాతం క్షీణదశకు చేరుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. బ్రెజిల్ దేశ పరిస్థితి మరీ విచిత్రంగా వుంది. ఈ దేశం నుంచి పెట్టుబడులు బయట దేశాలకు తరలి వెళ్లకుండా బ్యాంకుల వడ్డీ రేటు 30శాతంగా నిర్ణయించినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రపంచం మొత్తం మీద విదేశీ పెట్టుబడులు 300 బిలియన్ డాలర్లకు మించిలేవని ఇటీవల జరిపిన అధ్యయనంలో వెల్లడయ్యింది. అయితే అమెరికాలో జరిగే స్పెక్యులేషన్‌లో 1000 బిలియన్ డాలర్ల డబ్బు చేతులు మారుతుంది. హాంకాంగ్, సింగపూర్‌లలో ఈ విధమైన మని

తరువా 11వ పేజీలో

# విద్య, విజ్ఞాన ప్రతీకలు - సరస్వతి, భారతి!

డాక్టర్ జె.వి. సుబ్బరాయుడు

శరదిందు వికాసమందహాసాం
స్ఫురత్ ఇందీవర లోచనాభిరామమ్
అరవింద సమాన సుందరాస్యామ్
అరవిందాసన సుందరీం ఉపాసే

*యాకుందేందు తుషారహార ధవళా*
*యా శుభ్రవస్త్రాన్వితా, యావీణా*
*వరదండ మండితకరా,*
*యాశ్వేతపద్మాసనా...*

ఇత్యాదిగా విద్యా సంసిద్ధి కోసం, స్వచ్ఛమైన విజ్ఞాన సముపార్జన కోసం సరస్వతిని ప్రార్థించడం మనకు సాంప్రదాయం. వేదాధ్యయనానికి ముందు

*ఓం సహనావవతు, సహనౌభునక్తు,*
*సహవీర్యంకరవావహై*
*తేజస్వినా వధీతమస్తు, మా విద్విషావహై*
*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

అని శాంతి మంత్రాన్ని పఠించడం కూడా భారతీయ సంప్రదాయం. "ఈ అధ్యయనం మమ్మల్ని - అనగా అధ్యాపకుణ్ణి, అధ్యేతను, ఇద్దర్నీ కాపాడుగాక; మాకు సుఖజీవనం కలుగజేయుగాక; మేము శక్తి పొందుదుముగాక; మా అధ్యయనము తేజస్వి అగునుగాక" అని ఈ ఉపనిషత్ మంత్రార్థం. వాక్సిద్ధినీ, విద్యాసిద్ధినీ, జ్ఞానసిద్ధినీ లక్ష్యంగా ఉంచుకొని వాగ్దేవతను ఉద్దేశించి చేసే స్తోత్రమిది అని చెప్పవచ్చు.

ఇక సరస్వతి - (వాగ్దేవి) అంటే విజ్ఞానం. కుందపుష్పంలాగా, చంద్రుడిలాగా, మంచులాగా, ముత్యాల హారంలాగా, తెల్లని వస్త్రంలాగా అతి స్వచ్ఛమై నిర్మలమైనదని సరస్వతి రూపవర్ణన మనకు వ్యక్తం చేస్తుంది. అతి స్వచ్ఛమై, క్షీరంలాగా, శరత్పూర్ణిమ లాగా విజ్ఞానం గోచరించాలి. అలాంటి విజ్ఞానానికి, విద్యకు ఒక లౌకిక స్వరూపమిచ్చి ఆ జ్ఞాన స్వరూపాన్ని సరస్వతి అని పిలిచారు మన పూర్వులు. ఆ శక్తికి లౌకిక రూపం ఇవ్వడంలో ఒక్కొక్కరు ఒక్కో విధంగా భావించారు. శక్తిని స్త్రీ రూపంగా మనం భావిస్తాం. అందువల్లనే విజ్ఞాన శక్తిని స్త్రీ రూపంగా మనం భావిస్తాం. ఈ కారణం చేతనే జ్ఞాన శక్తిని సరస్వతి, శారద, భారతి అనే పేర్లతో మనం పిలుస్తున్నాం; ఆ శక్తినే ప్రార్థిస్తున్నాం.

ఇట్లా వాగ్దేవి అయిన శారదను - సరస్వతిని ప్రార్థన చేసే సాంప్రదాయం మనదేశంలో మాత్రమే కాదు - పాశ్చాత్య దేశాల్లోనూ ప్రాచీన కాలం నుంచి ఉన్నది. గ్రీకు, లాటిన్ సాహిత్యాల్లో మినర్వా, మ్యూజ్ మొదలైన రూపాల్లో సరస్వతిని ప్రార్థించడం ఉన్నది. మ్యూజ్ అంటే విద్య, బుద్ధి, కవిత, సంగీతాలకు అధిదేవతగా వారు భావించారు. వర్జిల్ మహాకవి తన `ఎ నీడ్' కావ్యారంభంలో మ్యూజ్‌ను స్తోత్రం చేశాడు. మహాకవి మిల్టన్ పేరడైజ్ లాస్ట్ కావ్యంలో మ్యూజ్ దేవతను స్తుతించాడు. మిల్టన్ ఆమెను ఇట్లా ప్రార్థిస్తాడు.

*What in me is dark*
*Illumin, What is low raise and support*
*That, to the height of this great argument*
*I May assert eternal providence*
*And justify the ways of God to men*

-- -- --

*Heaven hides nothing from the view*
*Nor the deep tract of Hell.*

నేడు మనం సరస్వతి, భారతి పదాలను వాగ్దేవికి పర్యాయ పదాలుగా ఉపయోగిస్తున్నాం. కాని ఈ రెండు పదాలలో సూక్ష్మమైన భేదముంది.

`బ్రాహ్మీతు భారతీ భాషా గీర్వాగ్వాణీ సరస్వతీ' అని అమరకోశం చెప్తున్నది. విజ్ఞాన వంతుడైన విద్వాంసుడి మనస్సు వివిధ విజ్ఞానాలకు నిలయమై `సరస్వాన్' అవుతున్నది. అందులోని వాక్కు సరస్వతి. ఈ విషయాన్ని "మనోహి సరస్వాన్, వాక్ సరస్వతీ, ఏతౌ సారస్వతావుత్సౌ" అని శతపథ బ్రాహ్మణం చెప్తున్నది. మనస్సును సరస్వాన్ అనీ, వాక్కును సరస్వతి అనీ, ఈ రెండూ సారస్వత ప్రవాహాలనీ సాయణ భాష్యం చెప్తున్నది. ఇట్లా "సరస్వాన్ మన ఉచ్యతే, సరస్వతీచ వాక్, ఏతౌ సారస్వతౌ ఇతి. స్వార్థకోణ్ ప్రత్యయః ఉత్సౌవారి ప్రవాహౌ వాఙ్మనసాత్మకౌ మనసస్తావత్ సర్వ శాస్త్రార్థ పరిజ్ఞాన రసాధారత్వాత్ వాచశ్చ తత్ర్పతి పాదన రసాధారత్వాదుత్సత్వ మనయోః" అని అలాగే విజ్ఞాన విషయాలను మననం చేసే కొద్దీ మనస్సులో నూతనమైన అంశాలు స్ఫురిస్తునే వుంటాయి. వాక్కు కూడా చిత్త సంస్కారాన్ని బట్టి వినూత్నమైన అర్థాలను స్ఫురింపజేస్తుంది. ఇక ప్రవాహం నిత్యసరణ శీలం కల్గినది. ప్రవాహంలాగా వాక్కు, మనస్సులు కూడా నిత్యాసరణ శీలం కలిగి సారస్వత, శాస్త్రవిజ్ఞాన ప్రవాహ రూపాలుగా భాసిస్తాయి. ఇక్కడ మనస్సు కళలకు, సర్వ శాస్త్రార్థ విజ్ఞానానికి నిలయమైతే వాక్కు తత్ప్రతిపాదితమైన రసానికి, దాని సిద్ధికి ఆధారమవు తున్నది.

శ్రవణం, మననం, పఠనం అనే మూడింటి వల్ల విద్యావంతుని మనస్సు శాస్త్ర విజ్ఞాన, రస సిద్ధులను పొంది `సరస్వాన్' అవుతున్నది. అలాంటి విద్యావంతుణ్ణి సరస్వంతుడు అంటారు. ఆ సరస్వంతుడి వాక్కు సరస్వతి అనే పేరుతో ప్రసిద్ధమవు తున్నది. ఆవాక్ శక్తికి సరస్వతి అని పేరు. విద్యాభ్యాస సమయంలో తనలో నిగూఢంగా వున్న జ్ఞానాన్ని వెలివరచి తన మనస్సును పవిత్రంగా, నిర్మలంగా, ఉంచమని ఆ దివ్య శక్తిని అర్థిస్తున్నాడు మానవుడు. అంతేకాదు ఉత్తమ విద్య (సరస్వతి) మానవుడి మనస్సును శోధించి మాలిన్యాన్ని తొలగించి విశుద్ధిని కల్గింప చేస్తుందని ఋగ్వేదం చెప్తున్నది.

ఈ శక్తి (సరస్వతి) విద్యాభ్యాస సమయంలో మానవుడి బుద్ధిని ఆవేశించి తల్లిలాగా యుక్తాయుక్త పరిజ్ఞానాన్ని ఉపదేశిస్తుందనీ, సంశయ నివృత్తి చేస్తుందనీ

*అగ్నిహోత్రా దహమభ్యాగతాన్మి*
*విప్రర్షభాణా సంశయచ్ఛేదనాయ*
*త్వత్సంయోగా దహమే తదబ్రువం*
*భావేస్థితా తథ్యమర్థం యథావత్*


అని భారతం చెప్తున్నది.

ఈ పరిశీలన వల్ల సరస్వతి హిందూత్వాన్ని ప్రబోధించే ఒక దేవతకాదని, విద్యాబుద్ధి వాక్ప్రతిభలకు ప్రతీక అనీ స్పష్టమవుతుంది. ఈ విద్యాబుద్ధులు మానవులకు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా హెచ్చు తగ్గుల పరిమాణాల్లో లభిస్తాయి. ఇవి అన్నీ నిర్మల స్వరూపాలు. ఆ స్వచ్ఛమైన రూపానికి ఒక లౌకిక రూపమిచ్చి, ఒక పేరుతో ప్రార్థిస్తున్నారు భారతీయులే కాదు ప్రపంచ ప్రజలందరూ.

## భారతి - భారతదేశం

స్వస్వరూప జ్ఞానం కల వ్యక్తిని ఆదిత్యరూపుడు అని, అతనిలో భాసిస్తున్న జ్ఞానాన్ని భారతి అని శ్రుతులు చెప్తున్నాయి. వైదిక వాఙ్మయంలో ఆదిత్యుడికి (సూర్యుడికి) భరత శబ్దం పర్యాయ వాచకంగా వాడబడ్డది. "భరతఆదిత్యః తస్యభాః భారతి" అని

తరువా 7వ పేజీలో

BPL ఫ్రాస్ట్ - ఫ్రీ రిఫ్రిజిరేటర్

కంపెనీ కొనుగోలు ధరలకే అమ్మకం

BPL

శీతాకాలపు అద్భుత అవకాశం కొద్దిరోజులే

| | | ధర | డిస్కౌంట్ | డెలివరీ ధర |
|---|---|---|---|---|
| 185 లీ. | 2 డోర్స్ | రూ.16419/- | రూ.3000/- | రూ.13,419/- |
| 200 లీ. | 2 డోర్స్ | రూ.17403/- | రూ.3000/- | రూ.14,403/- |
| 250 లీ. | 2 డోర్స్ | రూ.21835/- | రూ.4554/- | రూ.17,281/- |
| 260 లీ. | 2 డోర్స్ | రూ.22415/- | రూ.3700/- | రూ.18,715/- |

Authorised Sales & Service Dealer:

BABU ELECTRONICS

TRUNK ROAD, NELLORE, Ph: 324212

# అధికారం అక్రమార్జనకేనా?

రాష్ట్రంలో శాసన సభ్యులు, మంత్రులు, ఇతరత్రా నేతలు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యం పైనే నమ్మకం నశించే ప్రమాదం కన్పిస్తూంది. భారత రాజకీయాలలో అవినీతి అనేది కొత్తగా ఇప్పుడు పుట్టుకొచ్చిన పీడ కాదు. నెహ్రూ తరం నుంచి, ఇంకా చెప్పాలంటే స్వాతంత్ర్యం రాక మునుపు నుంచే మన రాజకీయ వ్యవస్థలో అవినీతి చెదపురుగులు పాతుకపోయి వున్నాయి. అవినీతి, అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం వంటి దుర్లక్షణాలు అత్యంత సాధారణ విషయాలుగా, నిత్యజీవన ప్రక్రియలో అంతర్భాగాలుగా పరిగణింపబడు తున్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఈ దగుల్బాజీ తనం మరీ మితిమీరి పోతున్నది. పత్రికా వార్తలు, పోలీసు కేసులు, సిబిఐ విచారణలు, న్యాయ స్థానాల చీవాట్లు అసెంబ్లీలో ఆగాలు వంటివేవీ రాజకీయ వాదులలో పరివర్తన తేలేక పోతున్నాయి. రోజుకొకటిగా బయటపడుతున్న రాజకీయ అవినీతి కథలు వింటుంటే బాధ కల్గుతూంది. ఏమిటీ పరిస్థితి? ఎందుకీ విపరీత పతనం? అధికారం వుండేది కేవలం అవినీతి కోసమేనా? రాజకీయాల పరమావధి అదేనా?

ఈ వారంలో వెల్లడైన రెండు సంఘటనలు చూడండి! చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి ఎమ్మెల్యే శ్రీమతి లక్ష్మీదేవమ్మపై ఎక్సైజ్ పోలీసులు అక్రమ మద్యం కేసు పెట్టారు. అనంతపురం జిల్లా గోరంట్ల ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రి శ్రీనిమ్మల కిష్టప్ప బావ ఇంట్లో లారీ లోడు దొంగసారా పాకెట్లు పట్టుకుని, అతడి మేనల్లుడ్ని అరెస్టు చేశారు. అంతకు క్రితం, మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ హైదరాబాదు 'సిటీలో రైల్వే కాంట్రాక్టర్లను బెదరించి, కిడ్నాప్ చేసి, టెండర్లను తన అనుచరులకు ఇప్పించాడన్న గగ్గోలు రేగింది. ఆ దౌర్జన్యం కారణంతోనే అతడ్ని మంత్రి పదవి నుంచి తప్పించారని వార్తలు వెలువడ్డాయి. నంద్యాల ఎమ్మెల్యే భూమానాగిరెడ్డికి అక్రమ మద్యం వ్యాపారంతో సంబంధం వుందని ఎక్సైజ్ కమీషనరే స్వయంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అందుకు ప్రతిఫలంగా ఆ కమీషర్‌ను ఆ పదవి నుంచి తప్పించివేసి, నాగిరెడ్డి గారికి, ఆయన సతీమణికి కూడా ఎన్నికల్లోపోటీ చేయడానికి టిక్కెట్లిచ్చి సత్కరించారు.

ఇర్రిగేషన్ టెండర్లు, కాంట్రాక్టులు, కుంభకోణాలలో పాత్ర వహించని శాసనసభ్యుడు, మంత్రి ఎక్కడో అరుదుగా తప్ప కన్పడరన్నది వాస్తవం. రాష్ట్రంలో ఎక్కడే ప్రాజెక్టు నిర్మాణం, కాలువ త్రవ్వకం, చెరువు రిపేరు జరుగుతున్నా అక్కడల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు, వారి అనుచరులు ప్రత్యక్షమై పోతున్నారు. కాంట్రాక్టర్లను బెదరించి, భయపెట్టి టెండర్లు హస్తగతం చేసుకొని విక్రయిస్తున్నారు. హోటల్ గదులలో, ప్రభుత్వ గెస్టహౌసలలో పబ్లిక్‌గా వేలం పాటలు జరుగుతున్నాయి. ఇవంతా పత్రికల్లో వార్తలుగా వస్తున్నాయి. కాని ఏ సంఘటనలోనూ ఏ రాజకీయ వాదిపైనా చట్టం ప్రకారం నేరారోపణ జరగడం లేదు. వారి రాజకీయ కార్యకలాపాలకు ఆటంకం కల్గడం లేదు. ప్రజలు తమ దుర్మార్గ ప్రవర్తనను గమనిస్తున్నారన్న సంకోచమే లేకుండా వారు జనం మధ్యకు వస్తున్నారు; సభలు పెట్టి ధర్మోపన్యాసాలు చేస్తున్నారు; మళ్లీ ఎన్నికల్లో నిలబడి గెలుస్తున్నారు. అవినీతికి పాల్పడడం తప్పు అన్న ఆలోచనే రాజకీయ వాదులలో కల్గడం లేదు. పైపెచ్చు అది తమ జన్మహక్కు అన్న ధీమాతో బ్రతికేస్తున్నారు.

వీరి అవినీతి కథలు వెలికి వచ్చినప్పుడు పత్రికలలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలక్షేపం చేయడం, జనం దృష్టి మళ్లించడం ఒక ఆటగా మారిపోయింది. ఆరోపణలు వచ్చిన మంత్రి వాటికి సమాధానం చెప్పవలసింది పోయి, ఆ ఆరోపణలు చేసిన వారిని నిందించడం, ఎదురు విమర్శలతో ఆగం చేయడం అలవాటు చేసుకొంటున్నారు.

ఇటువంటి సందర్భాలలో జరిపే దర్యాప్తులు ఇంకా పెద్ద ప్రహసనాలు. మంత్రులపైన అధికారులను విచారణకు నియమిస్తారు. కాని మంత్రులు మాత్రం తమ పదవుల్లో యధాతథంగా కొనసాగుతారు. అధికారం వారి చేతిలో వున్నంత కాలం ఏ అధికారి వారిని ప్రశ్నించగలడు? ఏ సాక్షి ధైర్యంగా వచ్చి సాక్ష్యం చెప్పగలడు? అవి రెండూ జరగని పనులను తెలుసు కాబట్టే ప్రభుత్వం ఈ దర్యాప్తులకు ఆదేశిస్తుంటుంది. ఏ మాత్రం చిత్త శుద్ధి లేకుండా వ్యవహరిస్తుంది. ఆరోపణ వచ్చినప్పుడు అది నిజమో, కాదో తేలేంత

**జమీన్‌రైతు**

వరకు ఆరోపణలకు గురైన వారిని పదవుల నుంచి తప్పించే సాంప్రదాయం ఎవరూ పాటించడం లేదు.

ఈ విషయంలో మాత్రం తెలుగుదేశం, కాంగ్రెస్, కమ్యూనిస్టలనే తేడా లేదు. ప్రజాధనాన్ని బొక్కడానికి పార్టీ ఎల్లలు అడ్డురావడం లేదు. అందరూ కలిసి వాటాలు పంచుకొని మరీ భోం చేస్తున్నారు.

ఈ దుర్మార్గ ప్రవర్తనకు ఎట్లా ఫుల్‌స్టాప్ పెట్టాలి? ఎవరు కడ్తారు - పిల్లి మెడలో గంట? రాజకీయ వాదులను ఇట్లనే వదిలేస్తే మాత్రం రాజకీయాలే కాదు - సామాజిక వాతావరణమే కలుషితమై పోతుంది; కంపు పట్టిపోతుంది. రాజకీయ వాదులలో ఇటువంటి దుష్ప్రవర్తన ఇంక ఎంత మాత్రం కొనసాగడానికి వీడు. కాని అందుకు ప్రభుత్వం ఏదో చేయాలని, చేస్తుందని ఆశించడం వ్యర్థం. ప్రభుత్వాన్ని నడిపేది కూడా ఈ దుష్ట రాజకీయవాదులే అయినప్పుడు, ప్రభుత్వం నుంచి సత్ప్రవర్తన ఆశించడం మూర్ఖత్వమే కదా?

తమకు జరుగుతున్న ద్రోహం నుంచి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరుగుతున్న అపకారం నుంచి తమను తాము కాపాడుకోవడానికి ప్రజలే ఉద్యమించ వలసిన సమయం ఆసన్నమైంది. అధికారంలో వుండే వారిని మనమేమీ చేయలేమన్న నిరాశ; మనం ఒక్కరం కదిలితే లాభం ఏమిటన్న నిర్లిప్తత; ప్రపంచం ఎట్లా నడిస్తే మనమూ అట్నే వెళ్తే పోలేదా అన్న ఉదాసీనత ప్రజలలో నుంచి తొలగి పోతే తప్ప వ్యవస్థ బాగు పడదు. తప్పు చేసిన రాజకీయ వాదులను పబ్లిక్‌గా నిలదీయ గల్గిన సాహసం కల్గి, చేసిన తప్పులు రుజువు చేయడానికి చొరవ చూపగల్గిన వారు ముందు నిలబడి ప్రజలను నడిపించ వలసిన అవసరం వుంది. జనంలో ఆ చైతన్యం రాకుంటే పరిస్థితిలో మార్పు రాదు. జనం నిర్లిప్తతతో వుండిపోతే రాజకీయవాదులు మరీ బరితెగించి పోతారు. ప్రజా జీవితాన్ని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పీల్చి పిప్పి చేసేస్తారు.

* * *

---

**జమీన్‌రైతు**

తేది:19.11.48

వెల:0-2-0 పేజీలు:12

### దొంగ వైమానికుడు కాటన్

కెయిరో పత్రిక ప్రతినిధినని చెప్పి బ్లిట్జ్ విలేఖరి కరాచీలో సిడ్నీ కాటన్ను కలుసుకొని నైజాం వృత్తాంతాన్నంతా అతని నోటి గుండానే పలికించి సేకరించాడు.

### ముస్లిం పక్షపాతి

ఈ ప్రతినిధి ముస్లిమని విని సంతోషపడి తాను క్రిస్టియన్‌గా పుట్టినా ముస్లింలను అభిమానించి - ఆదరించడం తన అభిమతమంటూ ఒకటిన్నర గంట సేపు బాతాఖానీ వేశాడట. తన ప్రాణాన్ని సైతం లెక్కచెయ్యకుండా - శత్రుభూమిపై ఎగిరిపోయి నైజాంకు సాయపడడం కేవలం డబ్బు కొరకుగాక ముస్లిం సమస్యకు విధిగా చేశానన్నాడట.

### నైజాంకు 50 ట్రిప్పులు

రాజకీయ - మిలిటరీ ఎత్తుల కొరకు కాటన్ 50 సార్లు విమాన యానాలను సాగించాడట. అతనిప్పటికి వాటిని "సాహస ) రాయబారాలనే అంటాడట - "రాయబారిని - అతని పలహారాల్లకు నాలుగుసార్లు కరాచీ తీసుకొచ్చి తిరుగా వదలిపెట్టాను. పాకిస్తాన్ సైన్యానికి చెందిన అక్బర్ ఖాన్ను రెండుసార్లు హైదరాబాదుకు తీసుక పొయ్యొచ్చాను - అవసరమైనపుడల్లా సివిల్ - మిలిటరీ ఆఫీసర్లలా నటించాం" అని గూడా అతడన్నాడట.

### అమెరికాలో ట్రూమన్ గెలుపు

అమెరికాలో ట్రూమనే గెల్చినాడు. పత్రికల నిండా డ్యూయీ గెలుస్తాడని ఖండింతంగా వ్రాశారు. రూజువెల్టు పుణ్యమాయని ట్రూమన్ అధ్యక్షుడయినాడు.

ప్రెసిడెంటు రూజువెల్టు, అబ్రహం లింకన్ తర్వాత అమెరికా చరిత్రలో

**50 ఏళ్లక్రితం ఈ వారం**

ప్రపంచంలో ఇంత ప్రఖ్యాతిని పొందిన ప్రెసిడెంటు లేరు. ఈతడు సృష్టించిన పదజాలం రాజకీయ సామాన్య పారిభాషికమై పోయింది. న్యూడీల్ - రికవరీ - కంట్రోల్ (నవవిధానం - కోలుకొనే మార్గం - కంట్రోళ్లు) ఇత్యాది అమెరికాలో రైతులకు కూలీలకు జనసామాన్యానికి ఏమి కావలెనో రూజు వెల్టు గ్రహించాడు. అమెరికా ఖండంలోని ఇతర దేశాలకు అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వం వల్ల ఏమి కావలెనో ఈతడు తెలుసుకొన్నాడు.

తరువాయి 10వ పేజీలో

---

# కలెక్టర్ గారూ! వత్తిళ్లకు లొంగవద్దు!!

జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, జన్మభూమి పథకంలో మంజూరైన నిధులను దిగమ్రింగిన వైనాన్ని 'జమీన్‌రైతు' పత్రిక ధైర్యంగా వ్రాసినందుకు అభినందనలు. ఎమ్మెల్యేలు ఈ విధంగా బరితెగించడం శోచనీయం. జిల్లాలో ఈ అన్యాయకర పరిస్థితుల మీద ఏదైన పార్టీ వారు లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తే బాగుంటుంది. మహిళా కలెక్టర్ నిజాయితీగా వుండడంతో పాటు, రాజకీయ వత్తిడులకు సైతం లొంగకూడదు. జిల్లా ప్రజా పంపిణీ వ్యవస్థలోని లోపాలను కూడా ఒక్క జమీన్‌రైతే బయట పెడుతున్నందుకు ఆనందంగా వుంది. నవంబర్ 6తేది వెలువడ్డ పత్రికలో 50 ఏళ్ల క్రితం ఈవారం శీర్షికలోని ప్రముఖ జర్నలిస్టు జికె. రెడ్డి, ప్రజా నాయకుడు వెన్నెలకంటి రాఘవయ్య వ్రాసిన లేఖలు తిరిగి ప్రచురించినందులకు ధన్యవాదాలు.

*సికింద్రాబాద్ ఎస్. రామచంద్రరావు*

### రాజకీయ పార్టీల అసలు రంగు

నాలుగు రాష్ట్రాల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించలేదు బిజెపి, కాంగ్రెస్ పార్టీలు. లోక్‌సభ సమావేశాల్లో మహిళా బిల్లు గూర్చి చాలా గొప్పలు చెప్పిన ఈ పార్టీలు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి వైపు నుంచి 9 మంది, కాంగ్రెస్

**జనవాణి**

వైపు నుంచి 10 మంది మహిళా అభ్యర్థులను మాత్రమే పోటీలో పెట్టడం శోచనీయం. ఈ వ్యవహారంలో విచారించ తగ్గ విషయమేమిటంటే ఢిల్లీలో బిజెపికి సుష్మా స్వరాజ్, కాంగ్రెస్‌కు షీలా దీక్షిత్ నాయకత్వం వహిస్తున్నారు. వీరిద్దరూ మహిళలే అయినప్పటికీ మహిళా అభ్యర్థులకు చేటివ్వక పోవడం ఆలోచించతగ్గ విషయం. రాజస్థాన్‌లో కాంగ్రెస్ 15, మధ్యప్రదేశ్‌లో కేవలం 22 మంది మహిళలను పోటీ చేయిస్తూంది. దేశ రాజకీయాల్లో ప్రధాన పాత్ర వహిస్తున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలు మహిళలపట్ల ఇంత నిర్లక్ష్య భావం చూపించడం ఏ మాత్రం సమంజసం కాదు.

తరువాయి 10వ పేజీలో


**డబుల్ బంపర్ డిస్కౌంట్ మేళా**



నెల్లూరు జిల్లాలో వాచీల రంగంలో కనీవినీ ఎరుగని బంపర్ డిస్కౌంట్. అన్ని కంపెనీల వాచీలు, గోడ గడియారాలు, అలారం టైంపీసులపై 10% తగ్గింపు. అంతే కాకుండా ఒకేసారి రూ.2,000ల పైన కొనుగోలు చేసిన వారికి 10% డిస్కౌంట్‌తో పాటు గోడగడియారం ఉచితం.

కొందరు ధరను పెంచి తగ్గింపు అంటారు అటువంటి కంపెనీలతో మోసపోకండి.

ఉదాహరణకు:

టైటాన్ రోల్డ్‌గోల్డ్ డే అండ్ డేట్ మోడల్

| | |
|---|---|
| నెం.C-49 మరియు B-74 కంపెనీ ధర | రూ.1,840.00 |
| మా తరపున 10% డిస్కౌంట్ | రూ. 184.00 |
| ఇప్పుడు మీకు మా దగ్గర మాత్రమే దొరుకు ధర | రూ.1,656.00 |

పై విధంగా అన్ని కంపెనీల వాచీలపై 10% డిస్కౌంట్ 18.11.98 నుండి ఇవ్వబడును.

స్థాపితం : 1965 ఫోన్ : 327820, 329401

**మదీనా వాచ్ కంపెనీ**

మెగా వాచ్ షోరూం, మదీనా బిల్డింగ్, నెల్లూరు

## వచ్చిన కోటా అందరికిస్తే!

# మిరపకాయలు-20 గ్రా ఎర్రగడ్డలు - 40 గ్రా

బహిరంగ మార్కెట్‌లో మిరపకాయలు, ఎర్రగడ్డలు ధరలను అదుపులోనికి తెచ్చేందుకని, రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఈ రెండు వస్తువులకు సంబంధించి నెల్లూరు టౌన్‌కు విడుదల చేసిన కోటా నవ్వు తెప్పించేలా వుంది. నెల్లూరు టౌన్‌లోని దరిదాపులు 110 రేషన్ షాపుల పరిధిలో లక్ష మందికిపైగా కార్డులు కలిగిన వినియోగదారులున్నారు. వీరంతా మిరపకాయల కోసం వస్తే విడుదల చేసిన కోటా ప్రకారం ఒక్కొక్క కార్డుదారునికి కేవలం 20 గ్రాముల సరకును అదీ డీలర్లు దాచకుండా ఇస్తే ఇవ్వగలుగుతారు. ఎర్రగడ్డలు మాత్రం 40 గ్రాముల వరకు ఇవ్వ వచ్చు. నెల్లూరు టౌన్‌కు కేవలం 5వేల కిలోల మిర్చి, 10వేల కిలోల ఎరగడ్డల కోటాను అధికారులు విడుదల చేయడంతో, రేషన్ షాపుకు 50 కిలోల మిర్చి బస్తా, 100 కిలోల ఎర్రగడ్డలు మాత్రమే దామాషా ప్రకారం వచ్చాయి. కార్డుదారునికి అరకిలో మిరపకాయల లెక్కన తన కొచ్చిన కోటాలో కేవలం 100 మంది కార్డులకు, ఎర్రగడ్డలను కూడా ఇదే మొత్తంలో వినియోగదారులకు డీలర్లు ఇవ్వగలుగుతున్నారు. టౌన్‌లో 18తేది ఈ రెండు వస్తువులు స్టాకు మిగిలిన డీలరే లేడంటే, వీటికున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఒక్కరోజులో వచ్చిన సరకు అయిపోతుండడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు, డబ్బులు సర్దుకొని రేషన్ షాపుల వద్దకు వెళ్లే సరికి అక్కడ సరకు లుండడం లేదు. దీనివల్ల ప్రజలందరికీ ఈ పథకం వల్ల ప్రయోజనం చేకూరడం లేదు. షాపుల్లో కిలో 35 రూపాయలుగా

కొరవ 11వ పేజీలో

# 'కక్షగట్టి సాధిస్తున్నారు'

జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు జన్మభూమి పథకం నిధులను ఏ విధంగా దుర్వినియోగం చేశారో, తాను ప్రజలకు తెలియజేసి నందువల్లే కక్ష కట్టి పసలేని ఆరోపణలు చేస్తున్నట్లు మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ రెవిన్యూ విభాగంలో జరిగిన అవకతవకలపై ఛైర్మన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి డిమాండ్ చేయడాన్ని ఖండిస్తూ, 15తేది పత్రికా విలేఖరులను పిలిచి ఆవేశంగా మాట్లాడారు. మునిసిపాలిటీలో జరిగిన అవకతవకల్లో నా ప్రమేయం ఉందని నిరూపిస్తే నెల్లూరు ఏ సెంటర్‌లో వారు ఉరివేసుకోమన్నా వేసుకొంటాను. నిరూపించలేక పోతే మంత్రి, ఎమ్మెల్యే ఏం చేస్తారో ప్రజలకు తెలియజేయాలన్నారు. బెదిరింపులకు ఆనం కుటుంబీకులు ఏనాడూ భయపడరు. ఇరిగేషన్ పనుల్లో జరిగిన అవినీతిపై రామలింగాపురంలోని ఆ శాఖ కార్యాలయం వద్ద బోర్డు పెట్టించినప్పటి నుండి మంత్రి చంద్రమోహన్‌రెడ్డి తనపై కోపాన్ని పెంచుకొన్నట్లు చెప్పారు. తెలుగుదేశం నాయకులు చేసిన ఆరోపణలకు భయపడి పాదయాత్రలు, నిరాహార దీక్షలు,

### ఆరోపణలపై వివేకా వేదన

మునిసిపల్ హక్కుల కోసం న్యాయస్థానాలకు వెళ్లడం ఆపన్నారు. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకిచ్చిన 8700 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలకు దారి మళ్లించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మునిసిపల్ రెవిన్యూ విభాగంలో ఆడిట్ జరిపించమని నేను ఎన్నోసార్లు ప్రభుత్వాన్ని కోరాను; వాళ్లు ఆపని చేయలేదు. నాకు అధికారం లేకపోయినా మునిసిపాలిటిలో అక్రమాలకు పాల్పడిన ఐదుగురు బిల్ కలెక్టర్లను సస్పెండ్ చేశాను. హైకోర్టుకు వెళ్లి మునిసిపాలిటీలో రెండు వందల మందికి టీచర్ పోస్టులు ఇవ్వగలిగాను. ఇంతకు ముందాయన ఒక పోస్టింగ్, ఊస్టింగ్, సస్పెన్షన్ అయినా చేయగలిగాడా అని పరోక్షంగా ఎమ్మెల్యే రమేష్‌రెడ్డిని వుద్దేశించి వ్యాఖ్యానించారు. ఏసిబి అధికారులు స్వాధీనం చేసుకొన్న రికార్డులను త్వరగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తే సంతోషించే వారిలో తాను మొదటి వాడినన్నారు. మునిసిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్, వాటర్ వర్క్స్, శానిటరీ, ఇంజనీరింగ్ విభాగాలపై విచారణ జరుపమని ప్రభుత్వాన్ని వివేకానందరెడ్డి కోరారు. పలువురు మునిసిపల్ కౌన్సిలర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### క్రికెట్ టీం సెలక్షన్!

డిసంబర్‌లో కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే అండర్ -

కొరవ 11వ పేజీలో



బాలాజీ లాకర్స్ ఎడ్యుకేషనల్ అకాడమీలో నిర్వహించిన కళాకృతుల ప్రదర్శనలో ప్రిన్సిపల్ రమేష్, విద్యార్థినీ, విద్యార్థులు.

# గ్యాస్ ధర తగ్గింపు "గ్యాసేనా"

అధికారులు చేస్తున్న వాగ్దానాలు సైతం రాజకీయ నాయకులు చేసే వాగ్దానాలను తలపింప జేస్తున్నాయి. జిల్లాలోని ఎల్‌పిజి గ్యాస్ ఏజన్సీ డీలర్లు, వినియోగదారులతో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు ఈ నెల 6తేది ఒక సమావేశం ఏర్పాటు చేసి, వివిధ తీర్మానాలు చేశారు. వీటిలో ముఖ్యమైనది వినియోగదారుడే స్టాక్ పాయింట్ నుంచి నేరుగా సిలిండర్ తెచ్చుకొంటే 5 రూపాయలు తగ్గించి ఇస్తారని, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కె. కేశవులు రెడ్డి ఘనంగా ప్రకటించారు. ఈ మధ్య టౌన్‌లో ఏర్పడిన గ్యాస్ కృత్రిమ కొరత వల్ల 50 శాతం వినియోగదారులు ప్రస్తుతం స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్లే తెచ్చుకొంటున్నారు. లేకుంటే నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొని వుంది. కాని టౌన్‌లోని ఏ గ్యాస్ ఏజన్సీ వారు కూడా తమ వద్దకు వచ్చి వినియోగదారుడు తీసుకెళ్తున్న సిలిండర్‌కు 5 రూపాయలు తగ్గించి తీసుకొన్నట్లు దాఖలా లేదు. అమలుకు నోచుకోని శుష్కవాగ్దానాలు ఎందుకు రెడ్డి గారు? అదే విధంగా టౌన్‌లో అత్యంత ఇబ్బందులు పడుతున్న పద్మశ్రీ గ్యాస్ ఏజన్సీ వినియోగదారులకు, డోర్ డెలివరి ఏర్పాటు చేస్తానన్న వాగ్దానాన్ని కూడా అధికారులు ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

## నెల్లూరుసంగతులు

### వీధులూడ్చిన మంత్రులు

క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా మంత్రులు చంద్రమోహన్‌రెడ్డి, పరసా రత్నం 14తేది నెల్లూరు టౌన్‌లోని నక్కలగుంట, ఇందిరానగర్‌లలో కాసేపు వీధులూడ్చారు. పత్రికల్లో ఫోటోల కోసం కాలువల్లో పూడిక తీసినట్లు, మొక్కలు నాటినట్లు ఫోజులిచ్చారు. నక్కలగుంట

కొరవ 11వ పేజీలో

# ట్రాఫిక్ మళ్లింపుతో గందరగోళం!

ఎస్పీలు మారినప్పుడల్లా నెల్లూరు టౌన్‌లో ట్రాఫిక్ పద్ధతులు మారుతుండడంతో ట్రంకురోడ్డులోని వ్యాపారస్తులు, ఆ మార్గాన నడిచి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఎస్పీగా సివి. నరసయ్య బాధ్యతలు స్వీకరించాక టౌన్‌లో ట్రాఫిక్‌పై దృష్టి కేంద్రీకరించారు. కొన్ని సమావేశాలనంతరం కొన్ని ట్రాఫిక్ పాయింట్లు ఏర్పాటు చేసి, అక్కడే టౌన్‌బస్సులు నిలుస్తాయని వారం పది రోజుల క్రితం ప్రకటించారు. కాని పర్యవేక్షణ కరువవ్వడంతో టౌన్ బస్సులు ఎక్కడ చెయ్యెత్తితే అక్కడ ఆగిపోతున్నాయి. ఈ నూతన స్టాపింగ్‌ల మార్పు, చేర్పుల్లో భాగంగా గాంధీబొమ్మ, మినీబైపాస్ మీదుగా వెళ్లే వాహనాలను ట్రంకురోడ్డు వైపుకు మళ్లించారు. వ్యాపార కూడలైన ఈ ప్రాంతంలో అడ్డూఅపూలేని టౌన్‌బస్సులు ఇళ్లలు లేని గుర్రాల్లా దూసుకుపోతుండడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము ధూళికి నిలయమైన వస్తువులు పాడై పోతున్నాయని వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. కనకమహల్ కూడలి నుంచి శ్రీనివాస మహల్ కూడలి వరకుండే ఇరుకు రోడ్డును దృష్టిలో పెట్టుకొని ఈ మార్గాన్ని ఎస్పీ వన్‌వే చేసినట్లున్నారు. కాని ట్రంకురోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు

### ట్రంకురోడ్డులో వ్యాపారుల గగ్గోలు!

గందరగోళానికి దారితీస్తుందని మర్చిపోయినట్లున్నారు. బృందావనం మార్గం గుండా మూతు హాళ్ల మీదుగా టౌన్‌బస్సులను నడప వచ్చు. కాని విజయమహల్ బాక్స్‌టైపు బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణం సమస్య కొరకరాని కొయ్యగా మారివుంది. ట్రంకురోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు విషయాన్ని ఎస్పీ మరొకసారి పునఃసమీక్షిస్తే బాగుంటుందేమో!

### క్లీన్ అండ్ గ్రీన్‌లో సూపర్‌వైజర్లు!

ప్రభుత్వ వుద్యోగులకు సెలవుదినమైన రెండవ శనివారాన్ని, రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య మూడవ శనివారానికి మార్చింది. కాని ఆరోజు కూడా వుద్యోగులు తమ కార్యాలయానికి హాజరై, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని ఉత్తర్వులు జారీ చేసింది. సెలవుకు అలవాటు పడిన ఉద్యోగులు ఈ కార్యక్రమంలో నామ మాత్రంగా పాల్గొంటున్నారు. ప్రభుత్వ వుద్యోగులు ఈనెలలో 14తేదినే క్లీన్ అండ్ గ్రీన్ వారంగా ప్రకటించడంతో, కలెక్టరేట్‌లోని వుద్యోగులు తప్పదన్నట్లు గంటసేపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇళ్లకు వెళ్లడం ప్రముఖాంశంగా చెప్పవచ్చు. 14తేది కలెక్టరేట్ ప్రాంగణంలోనే వున్న చిన్న చిన్న గుంటలు పూడ్చాలని

కొరవ 11వ పేజీలో

# తెలుగుదేశం బ్రహ్మాండం

జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి బ్రహ్మాండంగా వుందని ఆ పార్టీ పరిశీలకుడు జల్లి సిద్ధయ్య అభిప్రాయపడ్డారు. 11తేది నుంచి 16తేది వరకు జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో పార్టీ కార్యకర్తల సమీక్షా సమావేశాల్లో పాల్గొన్న తరువాత 16తేదీ నెల్లూరులో పత్రికల వారితో మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఉత్సాహంతో పార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం తొణికిస లాడుతూంది. చిన్న చిన్న విషయాల్లో కాసింత సర్దుబాట్లు జరిగితే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఎదురు వుండదు. అర్ధరాత్రి వేళల్లో పార్టీ సమీక్షా సమావేశాలు జరిగినా కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. ఇంతకన్నా పార్టీకి ఏం కావాలన్నారు. సమీక్షా సమావేశాల్లో మొహమాటాలు లేకుండా చర్చలు జరిగాయి. జిల్లా అధికార్ల వైఖరిపై ఆత్మకూరు ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకపోతానని.

### పరిశీలకుడి ప్రశంస

డిసెంబర్ నుంచి పార్టీ సభ్యత్వ కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రితో జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనాయకులు సమావేశం జరిపాక గ్రూపులే అసలు కనపడవని జోస్యం చెప్పారు.

# రాపూరులో ఆఫీసులన్నీ తరలిపోతున్నాయి!

తాతల కాలంలో బావులు త్రవ్విస్తే మనవళ్ల కాలంలో వీటిని పూడ్చిన సామెత అచ్చుగుద్దినట్లుగా, రాపూరు ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డికి బాగా సరిపోతుంది. ఏళ్ల తరబడి రాపూరులో నడుస్తున్న వివిధ

**ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్టో!**

ప్రభుత్వ కార్యాలయాలు వివిధ చోట్లకు తరలి వెళ్తుంటే పట్టించుకోని ఎమ్మెల్యే వైఖరిని ప్రజలు నిరసిస్తున్నారు. ఇక్కడున్న పంచాయతీ రాజ్ డివిజనల్ ఆఫీసును ఇటీవల నెల్లూరుకు తరలించారు. వ్యవసాయాధికారి కార్యాలయాన్ని పొదలకూరులో తీసుకెళ్లి పెట్టారు. చివరకు ఇక్కడుండిన కుష్టు నివారణ కేంద్ర కార్యాలయం సైతం వెంకటగిరికి తరలిపోతున్నా ఎమ్మెల్యే పట్టించు కోలేదన్న భావన ప్రజల మనసుల్లో నాటుకొని పోయివుంది. ఇక్కడి డిగ్రీ కళాశాలను కూడా ఎత్తి వేస్తారని వస్తున్న వార్తలు పలువురు విద్యార్థుల తండ్రుల గుండెల్లో రైళ్లను పరుగెత్తింప జేస్తున్నాయి. వెనుకబడిన ప్రాంతమైన రాపూరును అభివృద్ధి చేస్తానని ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన

తరువాయి 12వ పేజీలో



తిక్కవరపు సుబ్బరామిరెడ్డి కళాపీఠం అవార్డును సినీ నిర్మాత డాక్టర్ రామానాయుడుకు అందించి సత్కరించిన దృశ్యం. ఫోటోలో అక్కినేని నాగేశ్వర రావు, రాజ్యసభ ఉపాధ్యక్షురాలు నజ్మాహెప్తుల్లా, ద్రోణంరాజు సత్యనారాయణ, సుబ్బరామిరెడ్డి, దాసరి నారాయణరావు వున్నారు.

# కావలి మినీ స్టేడియం పగటి కలేనా?

కావలిలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగానే, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు పెరిగి పోతున్నాయి. అయితే అందుకు తగ్గట్టుగా వివిధ వసతులు సమకూరడం లేదు. విద్యాపరమైన వసతులకు సంబంధించి మినీ స్టేడియం ఏర్పాటును ముఖ్యమైన సమస్యగా చెప్పుకోవచ్చు. కావలి పట్టణం, డివిజన్‌లోని పలు ప్రాంతాలు త్వరగా అభివృద్ధి చెందుతుండటం తోబాటు విద్యా సంస్థలు కూడా అదే విధంగా ఎక్కువవు తున్నాయి. ప్రతి సంవత్సరం నగర, డివిజన్ స్థాయిల్లో జరిగే ఆటల పోటీలను ప్రైవేటు విద్యా సంస్థల స్థలాల్లో ఏర్పాటు చేయాల్సి వస్తూంది. ఇటువంటి పరిస్థితుల్లో కావలిలో వివిధ ఆటల పోటీలు, యితర కార్యక్రమాలు జరిపేందుకు ఒక మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించారు. అయితే స్టేడియంకు అనువైన స్థలం లేకపోవడంతో ఈ ప్రతిపాదనను విరమించారు. అయితే ఏడవ విడత జన్మభూమి కార్యక్రమంలో కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమ పాఠశాల యొక్క ఆట స్థలం అన్యాక్రాంతమై పోతూందని, వెంటనే దానికి ప్రహరీగోడ నిర్మించాలని కోరారు. ఈ విషయమై ఆర్డీఓ స్పందించి ప్రతిపాదనలు పంపించగా, కలెక్టరు 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అయితే ఈ పాఠశాల ఆటస్థలం 2.5 ఎకరాలు వుండగా యిప్పటికే ఒకటిన్నర ఎకరా అన్యాక్రాంతమై పోయింది. స్థానిక రాజకీయ

తరువాయి 12వ పేజీలో

# పాపకన్ను సోదరులకు కన్నీరే మిగిలింది!

రాపూరులో కాంగ్రెస్ పార్టీ నుంచి, తెలుగుదేశం పార్టీలో చేరిన పాపకన్ను సోదరుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారయ్యింది. వీరిని ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి పెద్దగా పట్టించు కోవడం లేదు. దీనికితోడు వీరికి అనుచరులుగా వున్న పలువురు తెలుగుదేశం పార్టీలో చేరడానికి మీనమేషాలు లెక్కిస్తుండడంతో పాపకన్ను సోదరులకు దిక్కు తోచడం లేదు. ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, ఇక్కడి మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు కొండ్లపూడి దశరధరామిరెడ్డి మాటకిస్తున్న ప్రాధాన్యత వీరిమదిలో చిచ్చు రేపుతూంది. ఈ విషయాలన్నింటిని మనసులో పెట్టుకొని తమ శక్తి నిరూపించాలని ఇందుకు వేదికగా 14తేది రాపూరులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాన్ని పాపకన్ను సోదరులు ఎంచుకొన్నారు. వెయ్యి మంది దళిత కార్యకర్తలను జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, పార్టీ పర్యవేక్షకుని ఎదుట పార్టీలో చేరుస్తామని ముందు గొప్పలు చెప్పారు. కాని పట్టుమని పది మందిని కూడా ఈ సమావేశంలో పార్టీలో చేర్చలేక పోయారు. సమావేశంలో వీరిని గుర్తి పట్టించుకొనే వారు లేకపోవడంతో సోదరులిద్దరూ బాగా బాధపడ్డారు. పార్టీ పరిశీలకుడు సిద్ధయ్య మళ్లీ ఎల్లసిరినే ఎమ్మెల్యేగా ఎన్నుకోమని పార్టీ కార్యకర్తలకు సలహా ఇవ్వడం రాజశేఖరరెడ్డికి మింగుడు పడలేదు. రాపూరు ఎమ్మెల్యే టిక్కెట్‌పై ఆశలు పెట్టుకొని, ముచ్చటైన మండలాధ్యక్షుని పదవి వదులుకొన్న రాజశేఖరరెడ్డి, ఏ విధంగా ఎల్లసిరినిఢీకొని తమ వర్గం ప్రతిష్ట నిలుపుకొంటారనేది వేచి చూస్తేగాని తెలియదు.

## హైస్కూల్‌లో పుస్తకాల కొరత

తోటపల్లిగూడూరు మండలం చెన్నపల్లిపాళెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పలువురు విద్యార్థులు టెక్స్ట్ పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. 9వ తరగతి చదువుతున్న పిల్లలకు మూడు నెలల పరీక్షలైనా ఇంత వరకు హిందీ, సోషల్ టెక్స్ట్ బుక్స్ ఇవ్వలేదు8వ తరగతి పిల్లలు పలు సబ్జెక్టల పుస్తకాలు లేక ఉసూరో మంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులకు, పిల్లలకు పంపిణీ చేయమని ప్రభుత్వం పంపిన పుస్తకాలను బయట అమ్మివేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొనింది. భావిపౌరులకు సరైన మార్గం చూపించాల్సిన ఉపాధ్యాయులే ఈ విధంగా తయారైతే ఎలా? *

# పత్తాలేని వార్డెన్!

అనంతసాగరంలోని బిసి హాస్టల్ వార్డన్ గత కొన్ని నెలలుగా హాస్టల్‌కు రావడం మానుకొన్నాడు. దీనివల్ల హాస్టల్‌లో దయనీయమైన పరిస్థితులు నెలకొని వున్నాయి. వార్డన్ బుచ్చిరెడ్డిపాళెంలో కాపురముంటూ చుట్టపు చూపుగా నాలుగు నెలలకొకసారి హాస్టల్ పరిశీలన కొస్తాడు. వచ్చినప్పుడే తనవాటాగా తీసుకోవాల్సిన మొత్తాన్ని తీసుకొని మిగిలిన రేషన్‌ను వంట మనిషి చేతికి అప్పచెప్పి పోతున్నాడట. హాస్టల్ రికార్డులో 60 మంది పిల్లలున్నట్లు పేర్లుంటాయి. కాని పట్టుమని 15 మంది పిల్లలు కూడా వుండరు. వంట మనిషి ఒకపూట రెండు పూటలకు కావల్సిన చాలీచాలని తిండిని వండి పెట్టి పొదుపు సూత్రాన్ని పాటిస్తూంది. పట్టించుకొనే వారు లేకపోవడంతో విద్యార్థుల చదువులు దిగేదుస్తున్నాయి. జిల్లా అధికారులు ఒకసారి అనంతసాగరం వెళ్లి హాస్టల్‌ను పరిశీలించి పరిస్థితులు చక్కదిద్దాల్సి వుంది.

**దుస్థితిలో అనంతసాగరం హాస్టల్**

## రాంపల్లి రైతులను వణికిస్తున్న దొంగలు

మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా మోటార్లు, స్టార్టర్లు, విద్యుత్ వైర్ల దొంగ తనాలు ఎక్కువయ్యాయి. దొంగతనాల మూలంగా మెట్ట ప్రాంతంలోని పొలాలకు సకాలంలో నీళ్లు అందక పైర్లు ఎండిపోతున్నాయి. ఇటీవల టి. నారసింహారెడ్డికి చెందిన పొలంలోని 3వేల రూపాయల విలువచేసే స్టార్టర్, కేబుల్ వైరు చోరీ అయ్యింది. భీమవరం సహకార సంఘంలో రుణం పొంది మోటార్లను ఇటీవలే బిగించుకొన్న రైతులు వీటి చోరీతో ఆర్థికంగా కృంగిపోతున్నారు. ఈ చోరీల విషయం పోలీసులకు చెప్పినా ప్రయోజనం వుండడం లేదని రైతులు వాపోతున్నారు.

## మనుబోలులో బాలల దినోత్సవం

బాలల దినోత్సవాన్ని పురస్కరించు కొని మనుబోలు యూత్ అండ్ కల్చరల్

తరువాయి 12వ పేజీలో

# రోతగా వున్న గూడూరు సినిమా హాళ్లు!

గూడూరు పట్టణంలోని 5సినిమా థియేటర్లలో అధ్వాన్నకర పరిస్థితులు నెలకొని వున్నాయి. ఏసి థియేటర్ల పేరిట టిక్కెట్లపై అదనపు రుసుం వసూలు చేస్తారుకాని ఏరోజు కూడా పొరపాటున ఏసివేయరు. దరిదాపులు అన్ని హాళ్లలోని సీట్లు చినిగిపోయి ప్రేక్షకులు సరిగ్గా కూర్చొని సినిమా చూడలేని పరిస్థితి నెలకొని వుంది. మూత్రశాలలు గబ్బు కొట్టు కొంటున్నాయి. కానీవీటి ప్రక్కనే క్యాంటిన్లు నిర్వహిస్తున్నారు. అసౌకర్యాన్ని ప్రేక్షకు లెవరైనా ప్రశ్నిస్తే రౌడీమూకైన హాళ్లలో పనిచేసే సిబ్బంది చేత వారిపై దాడి చేయించడం పరిపాటయ్యింది. అన్ని ఇక్కడే వుండి థియేటర్లలో కనీస వసతులు కల్పించడం ప్రభుత్వంచేత చేయకాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు.

## భలే టీచర్లు

సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, గత నెల రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో

**జిల్లావార్తలు**

పాటు, పాఠశాలకు తాళం కూడా వేసుకెళ్లి పోయారు. దీనివల్ల విద్యార్థులు మరో గత్యంతరం లేక స్కూల్ ప్రాంగణంలో ఆటా పాటలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ స్కూల్‌లో ఇద్దరు మహిళా టీచర్లను ప్రభుత్వం నియమించింది. వీరిలో ఒకరు నెల్లూరు, మరొకరు బుచ్చి నుండి రావాల్సి వుండడంతో, పాలుమాలి స్కూల్‌కు రాకుండా తమ ఇళ్లవద్దనే రిజిష్టరు పెట్టుకొని హాజరు పట్టీని పూర్తి చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. 75 మంది విద్యార్థులున్న ఈ పాఠశాల ఈ విధంగా మూత పడడం సహించలేని కొందరు గ్రామస్తులు, నెల్లూరులో కాపురముంటున్న టీచర్ వద్దకు వెళ్లి పాఠశాల తాళాలడిగితే ఇవ్వను నిరాకరించిందట. నెల రోజులుగా స్కూల్ మూసింది చాలక రెండు రోజుల నుంచి తన బదులుగా తన భర్తను పిల్లలకు చదువు చెప్పను పంపుతూందట. ఇంత ధైర్యం ఈ ఉపాధ్యాయులకు ఎక్కడి నుంచి వచ్చింది? విద్యాశాఖాధికారులు పనికి

మిగతా 12వ పేజీలో

# నెల్లూరు ముచ్చట్లు

## విదూషకుడు

### చంద్రమోహన్‌రెడ్డి

ఐదు శాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 22 తేది ఉదయం నెల్లూరు వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్లారు.

### నెల్ఫిన్ టోపీ

నెల్ఫిన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ పేరిట టేకు చెట్ల పెంపకం చేపడతామని చెప్పి జనం నుంచి కోట్లాది రూపాయలు దండిన దగాకోర్లు - బోర్డు త్రిప్పేశారు. ఒక్క నెల్లూరులోనే వీరు నాలుగు కోట్లు మూటగట్టు కున్నారట. గత పదిహేను రోజుల నుంచి ఆఫీసు తలుపులు తీయడం లేదు. ఈ డబ్బంతా పెట్టి; బెంగుళూరు, మద్రాసుల్లో ఆస్తులు కొనుక్కొని పరారు చిత్తగించినట్లున్నారు. వివరంగా పైవారం ముచ్చటించు కుందాం.

### బిజెపి దౌర్జన్యం

బిజెపికి చెందిన కొందరు రౌడీలు పొగతోటలోని ఒక డాక్టర్‌పై ఈ రోజు (21తేది) దౌర్జన్యం జరిపారు. పార్టీకి చందా ఇమ్మని అడిగారట; ఆయనకు తనకంత శక్తిలేదని నిస్సహాయత వ్యక్తం చేశారు; దానితో వారు క్లినిక్ సామగ్రి ధ్వంసం చేయబోయారు. సకాలానికి పోలీసు వచ్చి కాపాడింది.

టౌన్‌లో బిజెపి ఇటువంటి దౌర్జన్యాలు, బలవంతపు దండకాలు సర్వ సాధారణమై పోయాయి. రౌడీలను పెంచి పోషిస్తున్నదా పార్టీ. వారికి జనాన్ని బెదరించి బ్రతకడమే వృత్తిగా మారింది.

వెంకయ్య నాయుడు గారూ - తమరేమో జాతీయ స్థాయిలో పార్టీని మోస్తున్నారు; తమ శిష్యగణమేమో మీ పేరు చెప్పి, ఇట్లా ప్రవర్తిస్తున్నారు. మీ స్వంత జిల్లాలోనైనా మీ పార్టీని మీరు చక్కదిద్దుకోలేరా? సిగ్గు పోతున్నదండీ!


## ఇల్లు, పొలము అమ్మబడును

నెల్లూరు పట్టణమునకు సమీపములో వున్న (నెల్లూరు రాజుపాలెం) నవాబుపేటకు 3 కి.మీ. దూరం గల గ్రామములో వ్యవసాయానికి సంబంధించి ముఖ్యంగా చెఱకు పండించుటకు, వరి పండించుటకు మరియు రొయ్యల చెరువులకు అనువుగా వుండి, విద్యుత్ మోటారు సౌకర్యము కలిగి వున్న షుమారు 26 ఎకరముల పొలము అమ్మకమునకు సిద్ధముగా వున్నది. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ నందు షేర్లు కూడా ఇవ్వబడును. సత్సంబంధిత పొలములో 4 ఫిల్టర్ పాయింట్లు కలిగి, అత్యంత సౌకర్యవంతంగా, ఆధునిక వ్యవసాయమునకు అనుకూలంగా వుంది.

పై పొలానికి సమీపములో షుమారు ఎకరా స్థలములో 20 అంకణముల కట్టుబడి కలిగిన భవంతి ఫోను సౌకర్యముతో అమ్మకమునకు వున్నది. కొనదలచినవారు ఇతర వివరములకు ఈ క్రింది చిరునామా నందు సంప్రదించ వలసినది.

శ్రీ ఆనం సుబ్బరామరెడ్డి (బుల్లారెడ్డి)
సౌత్‌రాజుపాలెం గ్రామము (నెల్లూరు రాజుపాలెం)
నెల్లూరు రూరల్ మండలము, నెల్లూరు జిల్లా
ఫోన్: 322093, 334427


### వ్యాపారుల నిరసన

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ పేరుతో విజిలెన్స్, సేల్స్‌టాక్స్ అధికారాలు తమను అకారణంగా వేధిస్తున్నారని స్టోన్‌హౌస్‌పేట వ్యాపారులంతా నిరసన వ్యక్తం చేస్తున్నారు. 19తేది ఉదయం వారు అంగళ్లు మూసేసి, కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. తాము ప్రభుత్వం చెప్పిన ధరలకు సరకులు అమ్ముతున్నా ఇట్లా వేధించడం బాగోలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జాయింట్ కలెక్టర్ చంద్రమౌళి వారిని బుజ్జగించి పంపారు. ఈ ధర్నాకు సన్నపురెడ్డి పెంచలురెడ్డి, కనమర్లపూడి తిరుమలరావు నాయకత్వం వహించారు.

### వివేకా రాజీనామా కోరుతున్న మంత్రి

మునిసిపాలిటీలో జరిగాయని చెప్తున్న కుంభకోణాలకు నైతిక బాధ్యత వహించి ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి రాజీనామా చేయాలని మంత్రి చంద్రమోహనరెడ్డి కోరాడు. పత్రికా విలేఖరుల దగ్గర తన అభిలాష వ్యక్తం చేశారాయన.

### మంత్రిగారూ వివేకాను చూసి నేర్చుకోండి!

మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానంద రెడ్డి తనపై వచ్చిన ఆరోపణలపై తక్షణం ప్రతిస్పందించి, దర్యాప్తు జరిపించాలని తనంతట తానుగా కోరారని; అదే మంత్రి చంద్రమోహన్‌రెడ్డి మాత్రం సర్వేపల్లి కాలువ విషయంలో తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా, అధికారులు నేరుగా ఫిర్యాదు చేసినా ఉలుకుపలుకు లేకుండా తప్పించు కొంటున్నాడని; ఆయనకు చిత్తశుద్ధి వుంటే వివేకాను ఆదర్శంగా తీసుకొని తనంతట తానుగా ఎసిబి లేదా సిబిసిఐడిచే దర్యాప్తు నిర్వహింపజేయాలని డిసిసి అధ్యక్షుడు సివి. శేషారెడ్డి కోరారు. పత్రికల్లో వార్తలకే వివేకాను రాజీనామా చేయమంటున్న మంత్రి తనపై అధికార్లు నేర నిర్ధారణ చేశారని తెలిసీ వూరకుండి పోవడం ఏమి న్యాయం అని అడుగుతున్నాడు శేషారెడ్డి. మంత్రిగారు సమాధానం చెప్తారా?

### ఎసిబి వలలో మునిసిపల్ ఇంజనీరు

నెల్లూరు మునిసిపల్ ఇంజనీరు శ్రీవత్సలం ఇంటిపై ఎసిబి దాడి జరిగింది. ఆయనపై నిర్దిష్ట ఫిర్యాదులు రావడంతో ఈ దాడి నిర్వహించారట. ఫత్తేఖాన్‌పేటలోని ఆయన ఇంట్లో 55వేల రూపాయల డబ్బు, లక్షా 50వేల బ్యాంక్ బ్యాలన్సు, 20 సవర్ల బంగారు నగలతో పాటు పెద్ద మొత్తంలో ఫిక్సెడ్ డిపాజిట్ రసీదులు, ఇందిరా వికాస పత్రాలు, యుటిఐ సర్టిఫికేట్లు దొరికాయట. హైదరాబాదులో ఒకటి, విద్యానగర్‌లో మరొకటి - రెండు ఇళ్లు వున్నట్లు పత్రాలు లభించాయి. బ్యాంక్ లాకర్‌లో బంగారు బిస్కట్లు దొరికాయి. మద్రాసులోని ఆయన మామ ఇంట్లో కూడా చాలా డబ్బు దొరికిందట. ఎసిబి డిఎస్‌పి డివిఎల్‌ఎన్. మూర్తి దాడి జరిపారు.

మునిసిపాలిటీలో ఇప్పుడు జరుగుతున్న స్వాహా గగ్గోలుకు, దీనికి సంబంధం లేదు.

### లైబ్రరీ ఛైర్మన్‌పై పార్టీ విచారణ

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లియాఖత్ ఆలీ లైబ్రరీ భవనాన్ని తన వ్యసన మందిరంగా మార్చేశాడని; రాత్రయితే చాలు గాజులు, గ్లాసుల శబ్దాలతో లైబ్రరీ పరమ పావనమై పోతున్నదని జమీన్‌రైతులో, ఒక దినపత్రికలో వచ్చిన వార్తలపై తెలుగుదేశం అధిష్టాన వర్గం ఆయన్ను సంజాయిషీకోరింది. ఆ దెబ్బతో ఆయన లైబ్రరీ గెస్టురూంలో వుంచి వుండిన వ్యభిచారిణులను రాత్రికి రాత్రే ఉదయగిరికి పంపేశాడట. తాను సత్శీలుడనని, లైబ్రరీ వుద్యోగులే తనపై కక్ష కట్టి బ్రష్టు పట్టించారని సంజాయిషీ ఇచ్చాడు.

అయితే గ్రంథాలయ సంస్థ వుద్యోగుల సంఘం ఈ ఆరోపణను తిరస్కరిస్తున్నది. ఛైర్మన్‌గారి చీకటి పనులు ఆయన వ్యక్తిగత వ్యవహారం, వాటితో మాకు సంబంధం లేదు, మేము ఎవరికీ ఆ విషయాలు చెప్పలేదు, ఈ గొడవలోకి మమ్మల్ని లాగవద్దు అని ప్రకటించారు వారు.

### సైన్స్‌ఫెయిర్ అసంతృప్తి

నెల్లూరులో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లు దాన్ని తిలకించడానికి వచ్చిన విద్యార్థులను అసంతృప్తికి గురి చేశాయి. జిల్లాలోని పాఠశాలలన్నింటి నుంచి ఒకే రోజు పిల్లల్ని పిలిపించడంతో రద్దీ ఎక్కువై ఎవరూ ఏమీ చూడలేక పోయారు. పిల్లల్ని ఒక్క టేబుల్ దగ్గరా ఒక్క క్షణం ఆగనివ్వకుండా నెట్టి పారేయుడంతో పాపం వారు విస్సు బుచ్చుకొని వచ్చిన దారినే వెళ్లి పోవలసి వచ్చింది.

ఫెయిర్‌లో ప్రదర్శించిన అంశాలు కొన్ని చాలా బాగున్నాయి. కాని విద్యార్థులకు సరైన మార్గ దర్శకత్వం లేనందువల్ల ఒక అంశంపై పది, పన్నెండు పరికరాలు ప్రదర్శించారు. దానితో చూసే వారికి బోర్ కొట్టింది.

సైన్స్ ఫెయిర్ - పిల్లలలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు చాలా చక్కటి మార్గం. దాని నిర్వహణలో మరి కొంచెం శ్రద్ధ, మెళకువ చూపాలండీ - డిఇఓ గారూ!

### సంఘమిత్రకు స్టేట్ ర్యాంక్

నెల్లూరులోని సంఘమిత్ర హైస్కూలు విద్యార్థి సి.వి. శేషు మాధవ్ పదవ తరగతిలో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించాడు. రత్నం హైస్కూలుకు చెందిన కిరణ్మయి అనే విద్యార్థిని కూడా ర్యాంకు లభించింది.

కొరవ 7వ పేజీలో

**In the Court of the Senior Civil Judge, Nellore**

E.P. No. 125/97
O.S. No. 144/91

Indian Bank, Trunk Road, Nellore
... Decree Holder

Vs.

Goli Bharathi, w/o Ramanaiah, 10/596, Santhapet, Nellore
... Judgement Debtor

**NOTICE**

మీరు పై దావాలో బ్యాంకు వారికి కట్టవలసిన బాకీ మీరు కట్టనందున, బ్యాంకు వారు మీ వద్ద బాకీ రాబట్టు నిమిత్తం మీపై దావా వేసినారు. మీరు చెప్పవలసినది వుంటే మీరు పై కోర్టుకు 7.12.98 తేది 10 గంటలకు వచ్చి చెప్పవలసినది చెప్పుకోవచ్చును. అలా రాని పక్షంలో కోర్టువారు తీసుకొను చర్యలకు మీరు బాధ్యులవుతారు.

కె.ఆర్. దుర్గాంబ
Advocate for Decree Holder


WORLD CLASS QUALITY FROM A WORLD CLASS COMPANY

KING AMONG CEMENTS
ISO 9002
COMPANY

Priya
53 GOLD
MEGA CEMENT

A Quality Product of PRIYADARSHINI CEMENT LIMITED

## భారతి

2వ పేజీ తరువాత

నిరుక్తం చెప్తున్నది. భరతుడు ఆదిత్యుడు. ఆయన దీప్తి లేక కాంతి (భా=దీప్తి) లేక వాక్కు భారతి అని భాష్యకర్తల అభిప్రాయం. ఆదిత్యుడు భరతుడు, ఆయన విజ్ఞానం భారతి. ఈ భారతి ఆత్మ స్వరూప సాక్షాత్కారానికి తోడ్పడి బ్రహ్మానందాన్ని ప్రసాదించేది. సరస్వతి బ్రహ్మానంద తుల్యమైన (బ్రహ్మానందస బ్రహ్మచారి) మానసిక ఆనందాన్ని కల్గించే రూపమైతే భారతి బ్రహ్మానందాన్నే కలిగిస్తుంది. అంటే మహర్షిత్వాన్ని ప్రసాదించే ఆత్మజ్ఞానం భారతి అని అర్థం.

అగ్నికూడా భరత, భారత శబ్దాలతో పిలువబడు తున్నట్లు శ్రుతులు చెప్తున్నాయి

*తస్మా అగ్నిర్భారతః యంసత్ అగ్ని*
*రగామి భారతో వృత్రహా పురుచేతనః*
*ఉదగ్నే భారత"*

అని ఋగ్వేదం;

*భారతః హవిషోభర్తా అగ్నిః*

అని సాయణ భాష్యం చెప్తున్నది.

"ఏష (అగ్నిః) హిదేవేభ్యోహవ్యం భరతి తస్మాద్భరతోగ్ని రిత్యాహుః" అని శతపథ బ్రాహ్మణం వక్కాణిస్తున్నది. అంటే కర్మానుష్ఠాన సమయంలో అగ్నిని ఆవాహనం చేయడం, హవిస్సులను సమర్పించడం జరుగుతుంది. అందువల్ల అగ్ని హవిర్భర్త లేక భరతుడు అవుతున్నాడు. ఆ అగ్ని యొక్క పరమ పవిత్రమైన దివ్యకాంతిని భారతి అంటారు.

క్లుప్తంగా చెప్పాలంటే తేజోవంతమైన సూర్యకాంతి లాగా, పవిత్రమైన హవిస్సులను పొంది జ్వలిస్తున్న హోమాగ్ని లాగా భాసించే జ్ఞానం భారతి. సరస్వతికి వలె భారతికి మన ప్రాచీనులు రూపకల్పన చేయలేదు. భారతి వీణాపాణి కాదు, ధవళవర్ణ వస్త్రధారిణి కాదు. భారతి జ్వలిస్తున్న హోమాగ్ని వంటిది; మధ్యందిన మార్తాండుని దివ్యకిరణ మంజరి లాంటిది. అట్టి భారతిని కల్గియున్న వాడు భరతుడు. ఐహిక భోగాల నుంచి మానవుణ్ణి దూరంచేసి పునీతుణ్ణి చేసి పరార్థమే జన్మ పరమార్థం అనే ఆత్మజ్ఞానాన్ని బోధించేది భారతి. అసత్తు నుండి దూరం చేసి సత్యం వైపు మార్గం చూపే జ్ఞానం భారతి. తమస్సు నుంచి వెలుగుకు తీసుకొనివెళ్లే జ్ఞానం భారతి.

అట్టి భారతిని పొందినవాడు భరతుడు. తపస్సంపన్నులైన మహర్షులు భరతులు. వారి భారతి ప్రపంచ క్షేమం కోసం, మానవజాతి సముద్ధరణ కోసం నిర్దేశింపబడ్డది. అట్టి భరతులున్న దేశం కాబట్టి ఈ దేశాన్ని భారతదేశం అంటున్నాం. అంతే కాని భరతుడు పరిపాలించి నందువల్ల ఇది భారతదేశం కాలేదు. పైగా భరతులు చాలా మంది వున్నారు. ఏ భరతుని మూలంగా ఈ దేశం భారతదేశమైనదీ చెప్పజాలం. ఆ భరతుడికి ముందు ఈ దేశం పేరేమిటో ఊహించలేం.

*ప్రతి వ్యక్తి ఒక భరతుడై*
*ఆ వ్యక్తి భారతి నిస్వార్థ సంపన్నమై*
*సర్వేషాం శాంతిర్భవతు*
*సర్వేషాం పూర్ణం భవతు*
*లోకాః సమస్తాః సుఖినోభవంతు*

అని అనగలిగితే!!

**పొలము అమ్మబడును**

నెల్లూరు సమీపం, నార్తురాజు పాళెం కరెంట్ సబ్‌స్టేషన్ సమీపంలో రైస్‌మిల్లు దగ్గర మెయిన్‌రోడ్డులో 3 ఎకరాల పొలము అమ్మబడును. వివరాలకు సంప్రదించండి.

**ఫోన్ నెం. 335137**

## నిందలెందుకు

మొదటి పేజీ తరువాత

పడతారు. జిల్లాలో జన్మభూమి పనుల పేరుతో ఎమ్మెల్యేలు కోట్లాది రూపాయలు దోపిడీ చేసుకొని తింటున్నారని అధికారులే ప్రభుత్వానికి నివేదిక పంపినా, కనీసం విజిలెన్స్ విచారణ జరిపించమని అభ్యర్థించినా ఎమ్మెల్యేలు అంగీకరించడం లేదు. కాని వివేకానందరెడ్డి తనంతట తానుగా దర్యాప్తు కోరుతున్నాడు. దర్యాప్తు జరిపించేది తెలుగుదేశం ప్రభుత్వం. ఏ మాత్రం సందు దొరికినా తన తాటవల్చేయడం ఖాయం. అయినా దర్యాప్తు అడుగుతున్నాడంటే ఆ అవినీతిలో తనకు వాటా లేదని, తాను ఆ బురద పూసుకోలేదని ఆత్మధైర్యం వుండి వుండాలి.

ఆయనకు పాత్ర లేకపోవచ్చుకాని, అసలు అవినీతే లేదని మాత్రం ఎవరూ చెప్పలేరు. 1991 నుంచి 1998 లోపల ఇళ్ల పన్నుకు అర్హమైన కొత్త ఇళ్ల సంఖ్య కేవలం 7వేలు మాత్రమేనని అసెస్‌మెంట్ రిజిష్టర్‌లో వ్రాశారు. ఇంత పెద్ద టౌన్‌లో, ఏడేళ్ల వ్యవధిలో కొత్తగా కట్టిన ఇళ్ల సంఖ్య ఏడువేలేనా? అంతకు రెట్టింపైనా వుండి వుండాలి. కాని రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు కలిసి కొత్త ఇళ్ల యజమానుల దగ్గర లంచాలు తిని, పన్ను వేయకుండా జాప్యం చేస్తున్నారు. అట్లా నష్టపోతున్న పన్ను మొత్తం లక్షల్లో వుంటుంది. దండిన పన్నులో స్వంతానికి వాడుకొన్నది కూడా కోట్లలో వుండడం అసాధ్యం కాని, అదీ లక్షల్లో వుంటుంది.

ఇవి కాక - ఖాళీ స్థలాలపై పన్ను ఒకటి వుంది. ఇప్పటి వరకు కేవలం లక్షా 13వేలు మాత్రమే దండారు. కాని టౌన్‌లో సక్రమంగా సర్వే జరిపి, ఖాళీ స్థలాలను గుర్తించి, పన్ను విధిస్తే కనీసం పాతిక, ముప్పయ్ లక్షలైనా వసూలయ్యే అవకాశం వుంది. మునిసిపల్ అంగడి గదుల ద్వారా 80లక్షలు; ప్రభుత్వ కార్యాలయాల నుంచి 75 లక్షలు; నెల్లూరు స్పిన్నింగ్ మిల్ నుంచి 7 లక్షలు; కోర్టు కేసులలో చిక్కుక పోయి 25 లక్షలు వసూలు కావలసి వుందట. అధికారులు వీటి మీద శ్రద్ధ పెట్టడం లేదు. నెల్లూరులోని పరిశ్రమలు, సినిమాహాళ్ల నుంచి ప్రాపర్టీ ట్యాక్స్ దండడమే లేదు. అధికారులు, యజమానులు లాలూచీపడి ఏళ్ల తరబడి పన్నులు ఎగేస్తున్నారు. ఎంక్రోచ్‌మెంట్ ట్యాక్స్ అని ఒకటి వుంది. దాన్ని అసలు పట్టించు కోవడమే లేదు మునిసిపల్ అధికారులు.

ఇటువంటి పన్ను ఎగవేత లన్నింటిపైనా దర్యాప్తు జరిపించడం అవసరం. ఇప్పటికే ప్రభుత్వం ఏసిబి దర్యాప్తు ప్రారంభించింది. తెలుగుదేశం ఎమ్మెల్యేలు, మంత్రుల అవినీతిపై పత్రికల్లో ఎంత గగ్గోలు రేగినా ఉలుకు పలుకులేని ప్రభుత్వం, కాంగ్రెస్ ఛైర్మన్ కాబట్టి ఆఘమేఘాల మీద ఏసిబి దర్యాప్తు ప్రారంభించింది. అయితే ఇది ఏసిబి పరిధిలోకి వచ్చే విషయం కాదు. మునిసిపల్ లెక్కపక్కలు తెలిసిన ఆడిటర్లు నిర్వహించ వలసిన విచారణ; పోలీసులు ఏమి చేయగలరు?

ఇళ్ల పన్నులతో పాటు కాంట్రాక్టు పనుల్లో డివియేషన్లు, రివైజ్‌డ్ ఎస్టిమేషన్లు, బల్క్ శాంక్షన్ల పేరిట కూడా పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఇంకొక గగ్గోలు రేగింది. దీనికి ఛైర్మన్‌నే బాధ్యుణ్ని చేసి ఆరోపణలు గుమ్మరిస్తున్నారు.

వివేకానందరెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి; అందులోనూ రాష్ట్ర మునిసిపల్ ఛైర్మన్స్ ఛాంబర్ అధ్యక్షుడు; మునిసిపల్ ఛైర్మన్లకు అధికారాలు కావాలని ఒకటే ఆగం చేస్తున్నాడు. అందువల్ల ఆయన నోరు మూయించటానికి ఇదే అవకాశమని భావిస్తున్నట్లుంది తెలుగుదేశం నేతలు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే టి. రమేష్‌రెడ్డి ముఖ్యమంత్రిని కలిసి, వివేకాను ఒక నొక్కు నొక్కి చూడమని అభ్యర్థించారట.

***

ఈ విషయం చర్చించడానికి 20తేది సాయంత్రం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం జరిపారు. చర్చలు వాడిగా, వేడిగా జరిగాయి. మధ్యలో ఆవేశాలు పెరిగిపోయి తెలుగుదేశం కౌన్సిలర్ ధర్మవరపు సుబ్బారావు చొక్కా చింపేశారు కాంగ్రెస్ కౌన్సిలర్లు. కెవి. రాఘవరెడ్డికి కోపం మరీ అధికంగా తన్నుక వచ్చింది. తెలుగుదేశం వారిపై వంటి కాలిమీద లేచాడు. నోట్లో వేలు పెడితే కొరక గలడా అన్నంత అమాయకంగా కన్పించే చాట్ల నరసింహారావు సైతం సై అంటే సై అని సవాళ్లు విసిరాడు. వూటుకూరు లక్ష్మయ్య వంటి వారూ ముందుకు దూకారు. సిపిఎం కౌన్సిలర్లు, ఛైర్మన్ కలిసి వారి కోపం చల్లార్చారు.

వివేకానందరెడ్డి చాలా సుదీర్ఘ వివరణ ఇచ్చాడు. మునిసిపాలిటీకి రావలసిన మొత్తం పన్నుల సొమ్మే 4 కోట్లు అయినప్పుడు, 4కోట్లు స్వాహా అనడం కేవలం రాజకీయ కక్ష సాధించడానికే; దీన్ని నాపై నెట్టి రాజకీయ లాభం పొందడానికి ప్రయత్నిస్తుం డడంతో అసలు నేరస్తులు తప్పించు కొంటున్నారు; ఆడిట్ జరగక పోవడం వల్ల, మునిసిపల్ కమిషనర్లు అవకతవకగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. అవి రెండూ నా పరిధిల్లోని విషయాలు కావు. ఒక్క ఇళ్లపన్నులే కాదు, మునిసిపాలిటీలోని ప్రతి విభాగంపైనా సమగ్ర దర్యాప్తు జరిపించమని నేను కోరుతున్నాను; రెండేళ్లకు పై నుంచి ఆడిటింగ్ చేయమని అడుగుతుంటే ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందువల్ల నా అంతట నేనుగా ప్రజాకోర్టు నిర్వహించాలని భావిస్తున్నాను. డిసెంబర్ 1,2 తేదులలో ఇదే కౌన్సిల్ హాల్‌లో ప్రజాకోర్టు నిర్వహిస్తాం. అన్ని పార్టీల నేతలు, ఎమ్మెల్యేలు, సీనియర్ సిటిజన్స్, సంఘ సేవకులు ఇందులో పాల్గొనాలని ఆహ్వానిస్తాం. పుస్తకాలు, లెక్కలు సమస్తం వారి ముందు పెడతాం. ఏ తప్పు కన్పించినా నేను బాధ్యత వహిస్తాను. నేనే తప్పూ చేయలేదు, ఏ దర్యాప్తుకూ నేను భయపడను. సిబిసిఐడి కాని, న్యాయ విచారణకాని నేను సిద్ధమే" - అన్నాడు వివేకానందరెడ్డి.

***

దీనిపై ఇంక చర్చ, రభస అనవసరం. ప్రభుత్వం తక్షణం దర్యాప్తు ప్రకటించడం అవసరం. కేవలం నిందలు వేసుకొంటూ పోతే ఎవరికీ ఏ ప్రయోజనమూ వుండదు. నిజాలు నిగ్గు తేల్చాలి. అది ఎంత త్వరగా జరిగితే అంతమేలు.

## జనానికి దూరం

మొదటి పేజీ తరువాత

దండగ అవుతుంది అని స్పష్టంగా చెప్పాడు సిద్దయ్య.

గూడూరు గురించి ఇంచు మించు అదే అభిప్రాయం వ్యక్తం చేశారాయన. ఎమ్మెల్యే దుర్గాప్రసాద్ పార్టీ పరంగా పూర్తి ఫ్లాప్. గ్రామాలలోకాని, టౌన్‌లోకాని తెలుగుదేశం నేతలను కలుపుక పోవడంలో పూర్తిగా విఫలమౌ తున్నాడు. ఆయన వెంట కార్యకర్తలూ లేరు, నేతలూ లేరు. పార్టీ సంగతి పట్టించు కోవడం లేదు. బాగా కష్టపడాల్సిన అవసరం వుంది - అన్నారు.

సర్వేపల్లి విషయంలో పాము చావ కుండా, కర్ర విరగకుండా నివేదిక ఇచ్చారు. చంద్రమోహన్‌రెడ్డి మంత్రి అయిన తర్వాత గ్రామాలతో సంబంధాలు కోల్పోతున్నాడు. ఆయనపై పార్టీ అభిమానులలో చాలా అసంతృప్తి వుంది. గతంలో వలె ప్రజాదరణ కన్పించడం లేదు. అభివృద్ధి పనులు పుష్కలంగా చేపట్టినా వాటి ద్వారా పార్టీ ప్రతిష్ఠను పెంచడానికి తగిన కృషి చేయడం లేదు. ఫలితంగా అభివృద్ధి పనులే వివాదంలో పడి, పార్టీ ప్రతిష్ఠ పల్చనౌతున్నదని అభిప్రాయపడ్డాడు సిద్దయ్య.

కోవూరులో పార్టీ పరిస్థితి చాలా బాగా వుంది కాని, ఎమ్మెల్యే పని తీరు మాత్రం ఘోరంగా వుందని నివేదించాడు. నియోజక వర్గ స్థాయిలో పార్టీనేతల మధ్య కలతలు ఎక్కువై పోయాయి; ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కార్యకర్తలను దూరం చేసుకొంటున్నాడు. ఆయన తన ప్రవర్తన సరిదిద్దుకొంటే ఈ నియోజక వర్గంలో పార్టీ గెలుపు కష్టం కాదు - అన్నాడు సిద్దయ్య.

అల్లూరు ఆదాల ప్రభాకరరెడ్డికి ఎదురే వుండదని గట్టిగా సిఫార్సు చేశాడు. ప్రభాకరరెడ్డి ఇప్పటి నుంచి గ్రామాలలోని పార్టీ ముఖ్యులతో సత్సంబంధాలు పెట్టుకోవాలని సలహా ఇచ్చాడు. కావలి వేణుగోపాల రెడ్డి గారికీ ఇటువంటి సూచనే చేశాడు. వేణుగోపాలరెడ్డి కృషి వల్ల పార్టీలో విభేధాలు తగ్గాయని; ఇంకొంచెం కష్టపడి పని చేస్తే గెలుపు తథ్యమని అభిప్రాయ పడ్డాడు.

ఉదయగిరిలో పార్టీ పరిస్థితి చాలా పటిష్ఠంగా వుంది. కాని ఎమ్మెల్యే విజయకుమారిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజమోహన్‌రెడ్డి కుటుంబానికి మధ్య కలతలు రేగడం మాత్రం ప్రమాదకరమని వార్నింగ్ ఇచ్చాడు సిద్దయ్య. ఈ విభేధాల వల్ల పార్టీ క్యాడర్‌లో చీలిక వస్తున్నదని, ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకొని ఇద్దరి మధ్య సమన్వయం సాధిస్తే తప్ప ఫలితం వుండదని చెప్పారాయన.

ఆత్మకూరు విషయంలో పార్టీ పరిస్థితి బాగా వుంది; ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు కూడా బాగా పని చేస్తున్నారు. కాని ఆయనకు నోటి దురుసుతనం వల్ల కార్యకర్తలు, అధికారులు బాధ పడుతున్నారు. ముఖ్యమంత్రి ఆయన్ను మందలించాలి - అన్నాడు సిద్దయ్య. అధికారులతో సత్సంబంధాలు లేకుంటే రేపటి ఎన్నికల్లో లేనిపోని సమస్యలు వస్తాయని హెచ్చరించాడు.

మొత్తం మీద సిద్దయ్యగారి నివేదిక జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితికి అద్దం పట్టింది. చాలా మంచి నివేదికే ఇచ్చారాయన. దీనిపై ముఖ్యమంత్రి స్పందన ఎట్లా వుంటుందో వేచి చూడాలి. *

## నెల్లూరుముచ్చట్లు

6వ పేజీ తరువాత

కోచింగ్ సెంటర్ల వ్యాపార విశృంఖలత్వాన్ని నివారించడానికి ప్రభుత్వం స్టేట్ ర్యాంకుల ప్రకటన నిలిపివేసింది. అయితే రాష్ట్రావతరణ దినోత్సవాల సందర్భంగా విద్యార్థులను సత్కరించే సాంప్రదాయం ఒకటి వుంది కాబట్టి, అందుకోసం ర్యాంకులు వచ్చిన విద్యార్థుల పేర్లు ప్రకటించక తప్పలేదు.

సంఘమిత్ర - పెద్దగా ప్రచారం లేని పాఠశాల. స్కూలు చిన్నదైనా చదువు బాగా చెప్పడంలో రాష్ట్ర ర్యాంకు సాధించగల్గారు. కరస్పాండెంట్ రవీంద్రకు, ర్యాంకు పొందిన విద్యార్థికి మా అభినందనలు. *

**రాజేశ్వరి హాస్పిటల్**

(స్వర్గీయ డా॥ యం. సుబ్బలక్ష్మిగారి "ఉమా నర్సింగ్ హోమ్" బిల్డింగ్ నందు)
కలెక్టర్ ఆఫీస్ వద్ద - టూరకాను - నెల్లూరు

**ప్రారంభం**
తే 22-11-98ది ఆదివారం,
ఉదయం గం॥ 9-00 లకు

**ప్రారంభకులు**
గౌ॥ శ్రీ తాళ్ళపాక రమేష్‌రెడ్డిగారు, M.L.A.

**ఆపరేషన్ థియేటర్ ప్రారంభకులు**
గౌ॥ డా॥ శ్రీ జెట్టి శేషారెడ్డిగారు
అధినేత, రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు.

ఆత్మీయులందరికీ మా ఆహ్వానం

డా॥ యస్. వేణుగోపాల్
M.B.B.S., M.D.

డా॥ ఎ. రాజేశ్వరి
M.B.B.S., M.D. Obst & Gynec., D.G.O.
కాన్పులు, స్త్రీల, గర్భకోశ వ్యాధుల మరియు సంతాన సాఫల్యత నిపుణులు.

# రాయి - తురాయి

## * తెలుగు కవిత్వం - తెలివి మీరి పోయింది!

**అగ్నిమిత్ర**

తెలుగు కవిత్వం తెలివి మీరి పోయింది; తేట తేట తెనుగు తనాన్ని పోకార్చుకొని, తెరచాటున నాటకమాడు తూంది. దాటించి చెప్పేది ఏది కూడా కవిత్వం కాని మాట నిజమే; కాసింత చాటూ, మాటు కవిత్వానికి తప్పనిసరి. మబ్బు వెనకదాగిన చంద్రుడు మబ్బు వీడి తటాలున వెన్నెల కుమ్మరించినట్లు కవిత్వం కూడా పాఠకుడికి తన ఎలుగును వినిపించి, అతడి మనస్సుపై కాసింత వెలుగును ప్రసరింప జెయ్యాలి; సున్నితమైన ఆ క్రాంతిలో పాఠకుడు భావాన్నీ, అలంకార ధ్వన్యాది సామగ్రిని వెతుక్కొని పట్టుకొనేటట్లు ప్రేరేపించాలి. అంతే తప్ప మూగ చెవిటి వాళ్ల ముచ్చట కాకూడదు.

కవిత్వం ప్రాయికంగా హృదయ వ్యాపారం; డెందంలో పుట్టిన స్పందనలకు అందమైన అభివ్యక్తి కవిత్వం. ఎదలో కదలాడే కదలికలు సర్వజనులకు సామాన్యం - వీసమెత్తు వాసి ఉంటే ఉండవచ్చు గాక - కాబట్టి చదివిన వెంటనే పఠితలకు ఉల్లాసాన్నీ, ఉత్తేజాన్నీ ప్రసాదిస్తుంది. ఇది ఒకనాటి కవిత్వ తత్వాన్ని గురించి చెబుతున్న మాట.

నేటి తెలుగు కవిత్వంపై సూత్రీకరణను తృణీకరిస్తున్నది. కాలాను గుణంగా తానూ తన `గాత్రాన్ని' మార్చుకోక తప్పదని నిలబలుకుతున్నది. మానవ జీవన విధానమే పెనుమార్పులకు లోనవు తున్నప్పుడు, మానవ కల్పితమైన తాను మాత్రం చెక్కు చెదరకుండా యథాపూర్వస్థితిలో ఎట్లా ఉండగలనని నిలదీసి ప్రశ్నిస్తున్నది. అంచేత పూర్వం వలె తన జన్మస్థానం హృదయ క్షేత్రం కాదనీ, బుద్ధిలోంచి పొటమరిస్తున్నదని బల్లగుద్ది చెబుతున్నది. దీనికి వెందలం (Back ground) లేకపోలేదు.

ఆంగ్ల సాహిత్య పారంగతులైన కొందరు ఆంధ్ర కవులు దాని నుంచి స్ఫూర్తిని పొంది కవిత్వం రాస్తున్నారు. ఎజ్రాపౌండ్, టి.ఎస్. ఇలియట్ వంటి ఆంగ్ల కవుల కవిత్వం బుద్ధి జన్యం. వాళ్ల కవిత్వాన్ని అధ్యయనం చేసి, ఆ కవితా కాసారంలో సుస్నాతులై, దుర్గమమైన ఆ మార్గంలో కవితా ప్రస్థానం సాగిస్తున్నారు. కాబట్టి నేటి తెలుగు కవిత్వం ప్రాయికంగా బౌద్ధిక వ్యాయామం (Intelectual Exercise) అయిపోయింది. తన స్వరూపాన్ని, స్వరాన్ని, స్వభావాన్ని మార్చుకొని మంచు గడ్డలా (Ice berg) తయారవు తున్నది; పాఠకులు దీన్ని ఢీ కొని తలబద్దలు కొట్టుకోవలసిన విషమ పరిస్థితి ఎదురవు తున్నది.

వేగుంట మోహనప్రసాద్ భేమ్ను నదిలో మునిగి కృష్ణలో తేలిన గడసరి; కవిగా విలక్షణుడు. ఆయన వాణీ, బాణీ ఆయనకే సొంతం; అన్యులకు అసాధ్యం. ఆంగ్ల కవిత్వ స్ఫూర్తి తప్ప పూర్వ ప్రపూర్వ తెలుగు కవుల ప్రభావం ఆయన మీద ఉన్నట్లు తోచదు. ఆయన మనోవల్మీకం లోంచి ప్రభవించిన కవిత "-దేవుడేడు-". నాలుగే నాలుగు పంక్తులు.

*దేవుడేడు ఉరోసు కొంటాడట*  
*నా తప్పులు క్షమించండంటాడట*  
*నా సామిరంగ - దేవుడేడికి సంకెళ్లువేసి*  
*నడి బజార్లో నేనుగాని లాక్కెళ్లుతుంటే*  
*ఆకాశం పక్కున నవ్వుతుంది!*

మోహన ప్రసాద్ కవిత్వంలో శబ్దాడంబరం ఉండదు. వాడే పదాలు మామూలు జనం వాడుకలో ఉండేవే. అయినా, భావపరమైన జటిలత్వం జడిపిస్తూనే, `జాగ్రత్త' అని హెచ్చరిస్తుంది. అవలకు గిరాటు వెయ్యనివ్వదు. ఆలోచనకు ప్రేరేపిస్తుంది. ఈ గుణమే మోహనప్రసాద్‌ను తాత్వికుడైన కవిగా నిలబెడుతున్నది.

దేవుడు అనవచ్చు కదా! `దేవుడేడు' అంటాడేమిటి? ఎందుకు తనకు తాను ఉరిసోకు కొంటున్నాడు దేవుడు? ఆయన చేసిన తప్పులేమిటి? క్షమించడమేమిటి? త్రేతాయుగం నుంచి నేటి దాకా ఎందరో అవతార పురుషులు, ప్రవక్తలు, యోగులు జన్మిస్తున్నారు. నాటి శ్రీకృష్ణుడి నుండి నేటి సాయిబాబా వరకు అందరూ ఒకే సత్యాన్ని నొక్కి మరీ చెబుతున్నారు. అదే `ప్రేమ' సకల జీవకోటిని ప్రేమించమన్నారు. అసూయా ద్వేషాలను అణచివేసి మానవులంతా సౌమనస్యంతో, సామరస్యంతో జీవించండన్నారు. మనం అట్లా వొద్దికతో బుద్ధిగా బ్రతుకుతున్నామా?

భగవద్గీతలోగాని, బైబిల్‌లోగాని, ఖురాన్‌లోగాని ఆ మహాత్ములు దేన్ని నొక్కి వక్కాణించారో దానికి భిన్నమైన ఆచరణ మనది. "నమాజులు, పూజలు సేయనేల?" అని ఉమర్‌ఖయ్యాం నేరక అనలేదు. పూజా పునస్కారాలు, ప్రదక్షిణలు, ధూపదీప నైవేద్యాదులూ - ఇవన్నీ ఆధ్యాత్మిక శిఖరాన్ని అందుకోవడానికి ఏర్పాటు చేసిన మెట్లు. బ్రతికినంత కాలం `ఒనమాలు' దిద్దు కోవడమేకాని పరిశోధించి పి.హెచ్‌డి. పట్టాను పొందలేక పోతున్నాం. భక్తిప్రవత్తులు నటిస్తూ శక్తికొలది కక్షలు కార్పణ్యాలు పెంచు కొంటున్నాం. భగవంతుడు బోధించిన సర్వమానవ ప్రేమ ఒక డ్రామా అయిపోయింది. అభినయం హెచ్చు; ఆచరణ లొచ్చు. దేవుడు చెప్పినమాట - వరహాల మూటను పెడచెవిని పెట్టి కాపథంలో కాల్లిడుతున్నాం. అందుకే మరి - దేవుడు సున్నిత మనస్కుడు కాబట్టి, దయామయుడు కావడం చేత మనం చేస్తున్న తప్పును తన మీద మోపుకొని `ఉరోసుకొంటా' నంటున్నాడు. మన నిరాదరణకు పాత్రుడైన వ్యక్తి ఊసు ప్రసక్తమైనప్పుడు - `వోడు' అనడం మన అలవాటు. దేవుడు చెప్పిన నిత్యసత్య ప్రేమతత్వం మీద గౌరవం లేక గురి తప్పి సంచరిస్తున్నాం. అందుకే కవి - "దేవుడేడు" అనటం.

విశ్వవ్యాపి అయిన నారాయణ మూర్తిని మన సంకుచిత స్వార్థబుద్ధులకు తగ్గట్టుగా మదింపు చేసి కుదించి తెప్పమీదనో తేరు మీదనో కూలనేసి మోకులతో బంధించి ఈడ్చుకొంటూ తిరువీధుల్లో తిప్పుతున్నాం. మధ్య మధ్య మింటొగసి మంటికి రాలిపడే తారా చువ్వల మెరుపులూ; రికార్డు డాన్సుల్లో సినిమా బూతు కూతలకు తగినట్లు లయబద్ధంగా చనుకట్టునూ మొలకట్టును ఊగిస్తూ ఊరించే ముద్దుగుమ్మల తళత్తళలు. కూడని వాటికన్నిటికి కూడాలిగా చేశాం దైవాన్ని. ఆయన చిత్తానికి హత్తుకొనేటట్లు కాకుండా మన ఇష్టానిష్టాలకు అనుకూలంగా పరమాత్మను మలచు కొంటున్నాం. శృంఖలాబద్ధుడు కాని పరమాత్మకు సంకెళ్లు తగిలించాం. "దేవుడేడికి సంకెళ్లు వేసి నడివీధిలో నేను లాక్కెళ్లుతూంటే." అని కవి అపహాస్యం చేస్తున్నది ఈ తతంగాన్నే. గతి తప్పిన మది; హృదిరెక్కని శ్రుతి. (Gospell) అసలు తత్వాన్ని అణగదొక్కి ఆచారకాండలో (Rituals) తలమునకలు కావడం.

ఇక `ఆకాశం నవ్వడం' -భూనభః పర్యంతం అభివ్యాప్తుడైన దైవం మన చిల్లర మల్లర చేష్టలను చూస్తూ, ఏమీ అనలేక, ఏమీ చెయ్యలేక మనల్ని చంటి పిల్లల కింద జమకట్టి ప్రహసం చేస్తున్నాడని అభిప్రాయం. నేలమీద నిలువ నీడలేక నింగికే పరిమితుడయ్యాడేమో! నిష్కళంకుడు, నిష్కపటి, నిర్మల ప్రేమకు నెలవు అయిన పరమేశ్వరుడు మనం ఆడే డ్రామాను తిలకిస్తూ పకాలున నవ్వుకోవడం తప్ప ఆయన కూడా మనలాగా సరికొత్త డ్రామా ఆడలేడు కదా! •

## జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడ మేమనగా,

మా తాలూకు స్వయంపాకుల వారి సత్రం వార్డు నెం.10/265, ఆనకట్ట రోడ్డు, రంగనాయకుల పేట, నెల్లూరులో వున్నది. సదరు ఆస్తి గురించి మా అన్నగారైన లేటు స్వయంపాకుల పట్టాభిరామమూర్తి మరియు ముగ్గురు జి. వెంకయ్య, వగైరాల మీద నెల్లూరు సబార్డినేట్ జడ్జి కోర్టులో నెం.157/84 అని దావా పర్మనెంట్ ఇంజెంక్షన్ స్వాధీనమునకును, ఉత్తరోత్తరా సదరు స్థలములో ఏ కట్టడములూ కట్టకూడదనియు, దావా వేసి 21.9.90 తేదిన డిక్రీ కూడా సదరు పట్టాభిరామ మూర్తి గారు పొంది యున్నారు. సదరు డిక్రీ మీద ప్రతివాదులైన గ్రంధకోటి సుందరమ్మ వగైరాలు, నెల్లూరు రెండవ అడిషనల్ జడ్జి కోర్టులో A.S.No. 61/95 అని అప్పీల్ వేసియున్నారు. అదే విధముగా నాగరాజ నారాయణమూర్తి పురఫ్ మన్న నారాయణ మూర్తి వగైరాలు సదరు నెల్లూరు సబ్ కోర్టు 157/84 డిక్రీ మీద నెల్లూరు 1వ అదనపు జిల్లా కోర్టులో 22/92 అని అప్పీల్ వేసి యున్నారు. సదరు రెండు కోర్టులలో సదరు రెండు అప్పీళ్లు జరుగుచున్న మధ్యకాలంలో మా అన్నగారైన శ్రీ స్వయంపాకుల పట్టాభిరామమూర్తి గారు 24.8.98 తేదిన కాలం చేసినారు. ఇది ఇలా వుండగా సదరు అప్పీళ్లలో అపెల్లెంట్లు ఇరువురు సదరు ఆస్తిని అమ్మ చూపుతున్నట్లు తెలియ వచ్చెను. సదరు ఆస్తిలో మాకు మా కుటుంబ సభ్యులకు తప్ప మరి ఎవ్వరికీ ఏ విధమైనటువంటి అధికారము గాని, హక్కుగాని లేదు. సదరు విషయము కోర్టులో పెండింగులో వుండగా సదరు ఆస్తిని ఎవ్వరు కొన్ననూ, విక్రయించిననూ, తనఖాగానూ వగైరాలు పెట్టుకొన్ననూ, మరి ఏ విధమైన ఆక్రమణలు చేసిననూ అవి చెల్లవు. కొన్నవారు నష్టపడగలరు.

స్వయంపాకుల సుబ్రహ్మణ్యం, వగైరాలు  
10/459, సంతపేట, నెల్లూరు




ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు పంటిళ్లపల్లి అరుణమ్మ, కొండవీటి రాధమ్మ

# తూర్పు వీధిన వ్యాపారోదయం!

**వాస్తుసంగతులు**  
**ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి**  
పిండిమిల్లు దగ్గర,  
పొదలకూరు రోడ్డు, నెల్లూరు

తూర్పు వీధి షాపులలో వ్యాపారాలు చేస్తున్న వ్యాపారస్తులు వాస్తు విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలి. తూర్పు దిశాధిపతి ఇంద్రుడు. ఇతను అనుకూలుడైతే తక్కిన దిశాధిపతులు కూడా సహకరిస్తారు. వాస్తు దోషాలు లేని వ్యాపారస్తుడికి ఇంద్రుడి `అలకాపురి' ధన సౌభాగ్యాలు లభిస్తాయని పెద్దలంటారు. తూర్పు షాపులకు షట్టర్లలో అంతర్గతంగా కానీ, విడిగా కానీ `గ్రిల్స్ ' వుండవచ్చు.

తూర్పు వీధి వ్యాపారస్తులు తూర్పు ఆగ్నేయంలో దక్షిణం వైపు వీపు చూపిస్తూ ఉత్తరాభిముఖంగా కూర్చోవాలి. గల్లాపెట్టె, కుర్చీ, టేబులు అన్నీ ఉత్తరాన్ని చూడాలి.

యజమాని కూర్చునే స్థానం ఎత్తుగా వుండాలి. అంచేత 12 అంగుళాల అరుగు నిర్మించు కోవడం మంచిది. ఈ అరుగు దక్షిణం ఎత్తుగానూ, ఉత్తరం పల్లంగానూ వుండాలి. (తగినంత)

### దేవుడి పటాలు

దేవుడి పటాలు దక్షిణం గోడకు ఆనించి ఉత్తరం చూసేలా అమర్చు కోవాలి. తూర్పు వైపు అంగళ్ల యజమానులు శక్తి ఫోటోలు వుంచు కోరాదు.

### బరువులు

దక్షిణం, పశ్చిమాలలో బరువులు వుండేలా చూసుకోవాలి. ఉత్తరంలో తేలికపాటి వస్తువుల నుంచు కోవాలి. బీరువాను తూర్పుకు అభిముఖంగా కానీ, ఉత్తరం వైపు కానీ ఏర్పాటు చేసుకోవాలి. అకౌంటు పుస్తకాలు దక్షిణం పశ్చిమాలలో అటకలు ఏర్పాటు చేసి వాటిపై వుంచు కోవచ్చు.

### వీధిపోట్లు

తూర్పు అంగళ్లకు తూర్పు ఆగ్నేయం వీధిపోటు అరిష్టాన్ని కలిగిస్తుంది. ఇట్లాంటి షాపులు వ్యాపారంలో అభివృద్ధి చెందవు. అట్లాంటప్పుడు తూర్పు ఆగ్నేయం గోడలో వినాయక విగ్రహం ప్రతిష్ఠించి సంపూజితమైన వాస్తు యంత్రాన్ని నిష్ఠాగరిష్టుడైన వాస్తు శాస్త్రజ్ఞుడి చేత సంప్రోక్షణ చేయించి, తూర్పుకు అభిముఖంగా అమర్చుకోవాలి. తూర్పు ఈశాన్యం వీధిపోటు వుంటే వ్యాపారస్థులకు సర్వ శుభాలను కలిగిస్తుంది.

### ప్రవేశం

యజమాని ఆగ్నేయంలో కూర్చోవాలి కాబట్టి, ప్రవేశం విధిగా తూర్పు ఈశాన్యంలో ఏర్పాటు చేసుకోవాలి.

### యంత్రాలు

వాస్తు శాస్త్రం ప్రకారం యజమాని కూర్చోవలసింది నైరుతిలో. అయితే నైరుతిలో యజమాని కూర్చుంటే, కొనుగోలుదారులతో మాటామంతీ కష్టం కాబట్టి తూర్పు షాపులలో ఆగ్నేయ స్థానాన్ని ఆధునిక వాస్తు శాస్త్రజ్ఞులు ఏర్పరిచారు. దీనివల్ల ఏర్పడే దోషం, తూర్పు వీధి దోషాలు, ఆగ్నేయ దోషాలు వీటన్నింటినీ కలిపి వాస్తు యంత్రాన్ని, సుబ్రహ్మణ్యస్వామి యంత్రాన్ని వ్యాపారస్తులు అమర్చు కోవడం వల్ల వాస్తు దోషాలు పరిహరింపబడతాయి.

### ప్రభావాలు

తూర్పు వాస్తు ఫలాఫలాలు ముఖ్యంగా యజమాని మగ సంతతిపై ప్రభావాన్ని చూపిస్తాయి. షాపులో పశ్చిమ దక్షిణాల కన్నా తూర్పు పడమరలు పల్లంగా వుండేటట్లు ఫ్లోరింగు వేయించుకోవాలి.

నీరు తూర్పు ఈశాన్యం గుండా కాలువలోకి ప్రవహించాలి. అట్లాగే తూర్పు, ఉత్తరాల్లో తేలికపాటి వస్తువులు తప్ప బరువైన వస్తువులు వేయకూడదు. ఇట్లా వాస్తు ప్రకారం సరిచేస్తే వ్యాపారస్తులు ధనంతోనూ, వంశాభివృద్ధితోనూ సుఖ పడతారు. తూర్పు ఎప్పటికీ ఎత్తుగా వుండ కూడదు. అట్లా వుంటే దరిద్రు లవుతారు. సంతానం అనారోగ్యంపాలై మంద మంతు లవుతారు. అంగడిలో తూర్పు అరుగులు ఎత్తుగా వుంటే అప్పులపాలై, అశాంతితో అల్లాడుతారు.

### కొనుగోలు స్థలాలు

తూర్పు అంగళ్లకు ఉత్తరం స్థలాన్ని యజమాని కొనుగోలు చేయవచ్చు. పశ్చిమ, దక్షిణ స్థలాన్ని ఉచితంగా యిచ్చినా తన స్థలానికి కలుపుకోగూడదు.

### అద్దెలు

తూర్పు వైపు షాపింగ్ కాంప్లెక్స్ గానీ, లేదా రెండు అంగళ్లుగానీ వున్నట్లయితే యజమాని ఉచ్చస్థితిలోని తూర్పు ఈశాన్యం వైపున వున్న అంగడిలో తాను వ్యాపారం చేయాలి. ప్రక్క షాపు అనగా ఆగ్నేయం వైపు షాపును బాడుగకు యివ్వాలి.

### ఫలితాలు

తూర్పువైపు వాస్తు లోపాలుకానీ, వాస్తు ఫలితాలు కానీ వున్నట్లయితే యజమానితో బాటు బాడుగకు వున్న వ్యాపారస్తుడు కూడా అశుభ ఫలితాలను సమానంగా అనుభవిస్తాడు. •

# రజనీకాంత్ 'పడయ్యప్పా'కు 20 కోట్లు

తమిళ చిత్రసీమలో ఇప్పటి వరకు జరగనంత వ్యాపారాన్ని చేసిపెట్టింది రజనీకాంత్ నటించిన 'పడయ్యప్పా' చిత్రం. ఈ మధ్యే షూటింగ్ ప్రారంభమైన ఈ చిత్రం ఒక్కొక్క ప్రింటు 12 లక్షల చొప్పున 84 ప్రింట్లు తమిళనాడులో అమ్మేశారు. తెలుగు, మలయాళ అనువాద హక్కులు ఏడుకోట్లు, ఆడియో హక్కులు రెండు కోట్ల 80 లక్షల వ్యాపారంతో కలుపుకొంటే ఈ చిత్రం ఇప్పటి వరకు 20 కోట్ల వ్యాపారాన్ని చేసినట్లు లెక్క. చిత్ర దర్శకుడు కె.ఎస్. రవికుమార్ ఈ చిత్రం పూర్తయ్యే వరకు మరో చిత్రాన్ని ఒప్పుకోనని శపథం చేశాడు.



వెలుగునీడలు చిత్రంలో జయప్రద

## హైదరాబాద్ సినిమా కబుర్లు!

### ఆర్టిస్టులకు పర్సనల్ టేస్ట్ ఉండకూడదు!

ఆర్టిస్టులకు పర్సనల్ టేస్ట్ ఉండకూడదంటున్నారు నటుడు ఆలీ. జనాలు ఇష్టపడే రీతిలో నటించడమే ఆర్టిస్ట్‌పని. అవసరమైతే తన కోరికలను చంపుకునైనా నటించాలి. అంతే; లేదంటే ఇంట్లో కూర్చొని ఈగలు తోలు కోవాల్సి వస్తుందన్నారు. నీకు హీరో అయ్యే లక్షణాలు వున్నాయన్నారు దర్శకులు కృష్ణారెడ్డి గారు. ఆశ్చర్యం లోంచి తేరుకొనే లోగానే హీరోనై పోయాను. 18 సినిమాల్లో హీరోగా నటించాను. మళ్లీ కొంత మంది వచ్చి కామెడీ వేషాలు ఇచ్చారు. 'ఓకే' అన్నాను. ఇంతేనండీ... ఇందులో నా ప్రమేయమేమీ లేదు. అంతా 'సినిమాయ' అన్నారు ఆలీ.

### మేకప్ లేకుంటే గుర్తించలేరు

తాను మేకప్ వేసుకోకుంటే తననెవరూ గుర్తించ లేరంటుంది హీరోయిన్ రంభ. నాకు సినిమాల్లో వచ్చేవన్ని గ్లామర్ పాత్రలు. అందువల్ల షూటింగుల్లో మోడ్రన్ డ్రెస్సుల్ని ధరించక తప్పదు. ఈ డ్రస్సులంటే మహా విసుగు. చూడీదార్ లంటే నాకిష్టం. ఫంక్షన్లకు సైతం మేకప్ లేకుండా చీరకట్టులో హాజరవుతాను. ఎవరైనా పరిచయం చేయనిదే... నన్ను రంభ అని ఎవరు గుర్తు పట్టలేరు. అందువల్ల మేకప్ లేకుండా హాయిగా షాపింగ్‌లకు వెళ్తానంటుంది.

### జూనియర్ యమునిగా రాజేంద్ర ప్రసాద్

లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ బేనర్‌పై మోహన్‌బాబు నిర్మిస్తున్న యమజాతకుడు చిత్రం కోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో లక్షలాది రూపాయల ఖర్చుపెట్టి యమలోకం సెట్‌ను ప్రత్యేకంగా నిర్మించారు. ఈ సెట్‌లో ఇద్దరు యములు, చిత్రగుప్తులు కనిపించగా నిర్మాత మోహన్‌బాబును వివరణ అడిగాను. ఇంత వరకూ ఈ తరహాగా వచ్చిన చిత్రాల్లో యముడు తీర్పులు చెప్పడం వంటి సంగతులు తెరపై ప్రేక్షకులు చూసే వుంటారు. యమజాతకుడు చిత్రంలో యముడు చలపతిరావు తాను రిటైర్ అవుతూ తన కుమారుడు జూనియర్ యముడు రాజేంద్ర ప్రసాద్‌ను ఆ పోస్ట్‌లో నియమిస్తాడు. చిత్ర గుప్తుడు ఎం.ఎస్. నారాయణ్, జూనియర్ చిత్రగుప్తుడిగా ఎవిఎస్‌ను నియమింప చేస్తారు. యమలోకం సీన్స్ పూర్వపు సినిమాల్లోలా ప్రేక్షకులను అలరించి తీరుతా యంటున్నారు మోహన్‌బాబు.

* * *

# శత రేపిస్ట్ చలపతిరావు!

విలన్‌గా పలు చిత్రాల్లో నటించిన చలపతిరావు వ్యక్తిగత కారణాల దృష్ట్యా అటువంటి పాత్రలకు ఇటీవల దూరంగా వున్నారు. దర్శకుడు ఇవివి. సత్యనారాయణ వత్తిడిమేరకు గాంధీ చిత్రంలో విలన్‌గా నటించక తప్పలేదన్నారు. ఈ సినిమాలో రేపిస్ట్‌గా నటిస్తున్నాను. ఇది నాకు 95వ రేప్ పాత్ర. నాలా సెంచరీకి దగ్గరగా వున్న రేపిస్ట్ విలన్ తెలుగు సినిమాల్లో మరొకరు లేరేమో అన్నారు. ఇటువంటి సీన్లలో నటించే సమయంలో, ఈ వయస్సులోనే వున్న కూతురు గుర్తుకొచ్చి మనసు తెగబాధ పడిపోద్ది. దర్శకులు నిజం కాదు కదా అని సర్ది నటింప జేస్తుంటారని చలపతిరావు ఆవేదనతో చెప్పారు.

* * *

# మా మీనా అమాయక కూన!

హీరోయిన్ మీనాలో చిన్న పిల్ల లక్షణాలు ఇంకా తొలగి పోలేదని ఆమె తల్లి రాజమల్లిక చెప్పారు. షూటింగ్‌లకు మీనాతో సహా హాజరయ్యే ఈమె గ్యాప్‌లో మాట్లాడారు. వయస్సు పెద్దగా లేకపోవడం వల్ల మీనా ఇంకా పరిణతి చెందలేదట. ఇంట్లో ఇష్టమైన వంటలు చేసిపెట్టమని మారాం చేస్తుందట. చిన్న, చిన్న విషయాల మీద అలుగుతుందట. ఏడాదికోసారి విదేశాలకు తీసుకెళ్లకపోతే ఒప్పుకోదని, షాపింగ్ అంటే అమితిష్టమని వివరించింది. చిన్న వస్తువులు సైతం భారీ రేట్లకు కొనిపారేస్తుందని చెబుతూ, తల్లిదండ్రులంటే మీనాకు అమిత గౌరవమంది. ఏ సినిమాకు ఎంత పారితోషికం తాము తీసుకొంటు న్నామన్న విషయాలేవీ పట్టించుకోదని ప్రశంసించింది. సో... మీనాను మంచి పిల్ల అనేద్దామా?

### మంచి చిత్రం కోసం ఎదురు చూపు

పలువురు హీరోయిన్ల చెల్లెళ్ల మాదిరే నగ్మా చెల్లెలు రోషిణి కూడా హీరోయిన్ అయ్యింది. చిరంజీవి సరసన మాస్టర్ చిత్రంలో నటించడంతో ఆమెకు పలుచిత్రాల్లో నటించే ఛాన్సు లొచ్చాయి. ఈ విషయాన్ని ఆమె వద్ద ప్రస్తావిస్తే... అన్ని గ్లామర్ పాత్రలే వస్తున్నాయండీ! పెర్‌ఫార్మింగ్ క్యారక్టర్స్ పిక్చర్స్ రావడం లేదు. వాటి కోసమే ఎదురు చూస్తున్నట్లు చెప్పింది.

### సినిమా మొత్తం టూరింగ్ టాకీసు మీదే

నటి సీత భర్త నటుడు, దర్శకుడైన పార్థిబన్ కొత్త తరహాలో చిత్రాలు తీసేందుకు శ్రమిస్తుంటాడు. నటుడుగా ఈ మధ్య బిజీగా వుండి మూడేళ్ల తరువాత మళ్లీ దర్శకత్వ బాధ్యతలు స్వీకరించిన పార్థిబన్ సినిమా మొత్తం టూరింగ్ టాకీసులో జరిగే విధంగా

తరువాయి 11వ పేజీలో

# లువెన్‌స్కీగా మోనికా బేడీ!

అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, మోనికా లివిన్‌స్కీల సంబంధం ఆధారంగా రష్యా, దర్శక నిర్మాత ఒక సినిమా తీయబో తున్నారు. ఈ చిత్రంలో లివిన్‌స్కీ పాత్రకు తెలుగు తాజమహల్ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన మోనికా బేడిని ఎంపిక చేశారు.

### 25 కోట్ల పారితోషికం!

ఈమె ఊహించనంత పారితోషికం 25 కోట్లు ఇవ్వడం ఈ నిర్మాత ముందుకు రావడంతో మోనిక దిమ్మ తిరిగిపోయింది. లివిన్‌స్కీకి - మోనికాకు పోలిక వుండడంతో ఈమెను ఈ పాత్రకు ప్రత్యేకంగా ఎంపిక చేశారు.

ఈ చిత్రంలో క్లింటన్ పాత్రధారిని ఇంకా ఎంపిక చేయలేదు. అమెరికా, యూరప్, రష్యాలలో విడుదల చేసాక భారతదేశంలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

### ఆస్కార్‌కు జీన్స్

ఆస్కార్ అవార్డు కోసం భారతదేశపు ఎంట్రీగా జీన్స్ తమిళ చిత్రాన్ని ఎంపిక చేశారు. ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఈ అవార్డుకు పంపమని 2 తెలుగు, 3 హిందీ, 1 బెంగాలీ, 2 తమిళ చిత్రాలు వచ్చాయి. హెచ్. బోస్ నేతృత్వంలోని ఒక కమిటీ ఈ ఎనిమిది చిత్రాలను పరిశీలించి జీన్స్‌ను సిఫార్సు చేశారు.

# అయోమయం "గమ్యం" చిత్రం

**చిత్రసమీక్ష ◆◆◆ గ్రిద్దలూరు గోపాలరావు**

ప్రస్తుత వాతావరణంలో యువకులను ఆకర్షించే విధంగా సినిమాలు తీస్తేనే అవి కొన్ని రోజులు ఆడే అవకాశం వుంది. ఆ అవకాశం కలిగించేందుకు మొదట సినిమాకు పెట్టే పేరు ఆకర్షణీయంగా వుండాలి. ఇప్పుడు రకరకాల ఆకర్షణీయమైన పేర్లతో సినిమాలు వచ్చేస్తున్నాయి. పేరు గొప్ప ఊరు దిబ్బగా వుండే సినిమాలు గూడా వున్నాయనుకోండి. అలా కాకుండా పేరుగొప్పగా పెట్టి ఆ పేరు గొప్పతనానికి తగ్గట్టుగా సినిమాను గూడా గొప్పగా ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో తీర్చిదిద్దే లక్ష్యాన్ని సినిమాలు నిర్మించే వాళ్లు గుర్తు పెట్టుకోవాలి.

జి. అనిల్‌కుమార్ దర్శకత్వంలో శ్రీమతి అరుణా బాబ్జీ నిర్మించి సినిమా "గమ్యం" పేరులోనే ప్రేక్షకులను ఆకర్షించే ధర్మాన్ని కోల్పోయింది. ఇక సినిమా విషయానికొస్తే, హిందీ సినిమా "ఘాయల్" ఆధారంగా "గమ్యం" సినిమా రూపుదాల్చు కుంది. ఆ రూపం సరిగ్గా లేదు. కథా రూపం నీరసంగా వుంది. రవిరాజా పినిశెట్టి వ్రాసిన స్క్రీన్‌ప్లే రూపురేఖల్లో ఎక్కడా పట్టులేదు. కథనంలో దర్శకుని సత్తా ఎక్కడా కనిపించదు. సినిమా మొదటి భాగం కొంత కుటుంబ సెంటిమెంటుతో, హాస్య సన్నివేశాలతో సర్దుకు పోతుంది. రెండవ భాగమంతా కొట్టుకోవటం, తిట్టుకోవటంతో సరిపెట్టు కుంటుంది. యాక్షన్ సన్నివేశాలను చూసి, చూసి విసుగెత్తి పోయిన ప్రేక్షకులకు, హీరో, విలన్లు మామూలు పంథాలోకొట్టు కోవటంతో కూడుకున్న సినిమా రెండవ భాగం డ్రాగింగనిపిస్తుంది. మొత్తం మీద సినిమా నీరసత్వంతో ఒక సాధారణ సినిమాగా వుంది.

సినిమాలోని నీరసత్వాన్ని కొంత వరకు మరుధూరి రాజా సంభాషణలు, విద్యాసాగర్ సంగీతం, మహీధర్ ఫోటోగ్రఫీ సరిదిద్దాయి.

హిందీ సినిమా కథకు కొద్ది మార్పులు చేర్పులతో తెలుగు వాతావరణం కొంత కల్పించారు. కమల్ (శ్రీకాంత్) మంచి బాక్సర్, బాక్సింగ్‌లో పేరు గడించాలన్నది అతని ఆశయం. ఆ దీక్షతో బాక్సింగ్‌లో అతను ఛాంపియన్ షిప్ సంపాదిస్తాడు. అందుకు అతన్ని అన్న (శరత్‌బాబు), వదినలు (గీత) ఎంతో సంతోషిస్తారు. వారి కుటుంబం సుఖసంతోషాలతో సవ్యంగా సాగిపోతూ వుంటుంది. కమల్ తన అన్నా, వదినలను తన తల్లిదండ్రుల్లాగా చూచుకొంటూ వుంటాడు. తాను ప్రేమించిన రూపతో (రవళి) ఆడుతూ పాడుతూ హాయిగా కాలం గడుపుతుంటాడు. ఉన్నట్టుండి కమల్ అన్న కనిపించకుండా పోతాడు. కమల్ తన అన్నను వెతకటం ప్రారంభిస్తాడు. ఒక స్మగ్లర్ (కోట శ్రీనివాసరావు) తన అన్నను కిడ్నాప్ చేసినట్టు కమల్ తెలుసుకుంటాడు. పోలీస్ రిపోర్టు యిస్తాడు. పోలీస్ గూడా అన్వేషణ సాగిస్తుంది. తన అన్నహత్యకు గురయ్యాడని తెలుసుకుంటాడు. స్మగ్లర్లు ఆ హత్యా నేరాన్ని కమల్ నెత్తికి చుట్టారు. అంతే కాకుండా కమల్ తన వదినతో అక్రమ సంబంధం సాగిస్తున్నాడన్న అపవాదు కూడా ప్రచారమవుతుంది. ఈ రెండు నేరాల మూలంగా కమల్ జైలు పాలవుతాడు. అవమాన

తరువాయి 11వ పేజీలో

# వారఫలాలు

**21.11.98నుండి 27.11.98 తేదివరకు; మేషంలో వక్రశని; సింహంలో రాహువు; కన్యలో కుజుడు; వృశ్చికంలో రవి, బుధ, శుక్రులు; కుంభంలో కేతు, గురువులు; ధనుర్మకర, కుంభాలలో చంద్రుడు.**



## మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం)

వృత్తి, వ్యాపార, వ్యవసాయాలలో బాగా శ్రమ వుంటుంది. ఆదాయం, ఆర్థిక స్థితి సంతృప్తికరంగా వుంటుంది. మొదట ఆటంకాలు కలిగినా పనులు నెరవేరగలవు. కొద్దిపాటి నేత్ర, శ్వాసకోశ సంబంధమైన అనారోగ్యం ఉంటుంది. కుటుంబ సౌఖ్యం వుంటుంది. ప్రయాణాలు చేయకుంటే మంచిది. పాతబాకీలు వస్తాయి. కుటుంబ పెద్దలకు కొద్ది అనారోగ్యం వుంటుంది.



## వృషభం

(కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2పాదాలు)

ఆరోగ్య భావం సరిగా వుండదు. పట్టుదల, పలుకుబడితో పనులు సాధించుకొంటారు. ఆర్థికస్థితి, ఆదాయం బాగుంటుంది. పెట్టుబడులకు మంచి అవకాశాలు లభిస్తాయి. సాంస్కృతిక కార్యాలలో పాల్గొనడం, సత్కర్మలు చేయడం, ఇతరులకు సహాయపడటం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వారాంతంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి.



## మిథునం

(మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

గట్టి ప్రయత్నాలు, పలుకుబడితో వారాంతంలో పనులు నెరవేరుతాయి. ఆర్థికంగా రాబడి ఆశించినంతగా ఉండదు. అనవసర విషయాలలో తలదూర్చకండి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, శ్రమ తప్పవు. కుటుంబ సౌఖ్యం, విద్యా, వివాహ ప్రయత్నాలు బాగుంటాయి. స్వల్పంగా డబ్బు, వస్తువుల నష్టం కలుగుతుంది.



## కర్కాటకం

(పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్రేషలు)

పనుల తొందర, అన్ని విషయాలలో జాగ్రత్త పడటం ఉంటుంది. ఆరోగ్యం లోపముండినను లెక్క చేయవలసిన పనిలేదు. ఆదాయ ప్రగతి ఉంటుంది. పనులందు సలహాలిచ్చే వారిని గమనించండి. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. డబ్బు రూపంలో మాట సహాయ రూపంలో ఇతరులకు తోడ్పడతారు. గుర్తింపు, గౌరవాలు బాగుంటాయి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధికి వస్తాయి.



## సింహం

(మఖ; పుబ్బ; ఉత్తర 1వ పాదం)

వృత్తి, వ్యాపారాలలో వృద్ధి, ఆదాయం పెరుగుదల ఉంటుంది. అందరిని అనుమానించే పరిస్థితు లుంటాయి. కటువుగా మాట్లాడి ఇతరులను బాధిస్తారు. సొంత పనులు సరిగా జరుగవు. బాకీల వసూలుకు సమయం కాదు. పెట్టుబడులకు మంచి అవకాశాలుంటాయి. అధికార నిర్వహణలో లోపాలు కలుగకుండా జాగ్రత్త పడాలి. వారాంతంలో ఖర్చులు పెరుగుతాయి.



## కన్య

(ఉత్తర 2, 3, 4పాదాలు; హస్త; చిత్త 1,2పాదాలు)

ఇంట్లో అందరికి ఆరోగ్యం సరిగా ఉండదు. ఆదాయం పెరుగుదల ఉండినా, ఖర్చులు కూడా బాగానే ఉంటాయి. పనులు సరిగా జరుగక కోపం, విసుగు ఎక్కువగా ఉంటుంది. బిడ్డల ఆరోగ్య, విద్యా సమస్యలు, వస్తు నష్టం ఉంటుంది. బంధువుల రాకపోకలు, కొంత వరకు బాకీలు వసూలు కావడం జరుగుతుంది. పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు పనులు యథావిధిగా సాగిపోతాయి.

## పంచాంగం

శుక్రమౌఢ్యమి, అనూరాధ కార్తె జరుగుతున్నవి.

### నవంబరు తిథులు

మార్గశిర శుద్ధ

| | | | |
|---|---|---|---|
| తేది 21 | శని | విదియ | ప.గ12.18వ |
| తేది 22 | ఆది | తదియ | ప.గ1.30వ |
| తేది 23 | సోమ | చతుర్థి | ప.గ2.15వ |
| తేది 24 | మంగళ | పంచమి | ప.గ2.37వ |
| తేది 25 | బుధ | షష్ఠి | ప.గ. 2.15వ |
| తేది 26 | గురు | సప్తమి | ప.గ.1.25వ |
| తేది 27 | శుక్ర | అష్టమి | పగ.12.10వ |

స్వయంపాకుల శ్రీనివాసులు ఎం.ఎ



## తుల

(చిత్ర 3,4పాదాలు, స్వాతి, విశాఖ1,2,3 పాదాలు)

కుటుంబ వ్యక్తులతోగాని, బయట వ్యక్తులతో తగాదాలు కలుగవచ్చును. ఆదాయ ప్రగతి సరిగా ఉండదు. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధ లుంటాయి. సొంత పనులు సరిగా జరుగవు. ఆలస్యం కాగలవు. ఉద్యోగులు బాగా శ్రమపడతారు. సన్నిహితులను గమనించి మెలగండి.



## వృశ్చికం

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

డబ్బు విషయంగా కుటుంబంలో విభేదాలు ఏర్పడగలవు. వృత్తి, వ్యాపారాలలో ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. వ్యవసాయదారులు ఇబ్బంది పడతారు. స్థిరాస్తుల పై రాబడి, బాకీల వసూలు సరిగా జరుగవు. అధికారుల సహకారం, మంచి గుర్తింపు పొందుతారు. దూర ప్రయాణాలు ఉండవచ్చును. శుభ వార్తలు వింటారు.



## ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

పనులు సరిగా జరుగవు. సన్నిహితులతో అధికారులతో విభేదాలు కలుగవచ్చును. ఆర్థికపరమైన సమస్యలు ఏర్పడ గలవు. ఈ రాశి వారికి రాబడి తగ్గిపోతుంది. ఖర్చులు పెరుగుట, వస్తు నష్టం, అనవసరంగా మాటలు పడటం, మానసికాందోళన ఎక్కువగా ఉండటం జరుగుతుంది. ఆదాయానికి ఆశపడతారు గాని ప్రయోజనం లేదు. కుటుంబ సభ్యుల మధ్య అనుకూలత తక్కువ.



## మకరం

(ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1,2 పాదాలు)

ఏ పనిలోగాని ప్రారంభంలో వున్న ఉత్సాహం తరవాత ఉండదు. వృత్తి, వ్యాపారాలలో ఆదాయం ఆశించినంత రాదుగాని పరవాలేదు. ఉద్యోగులు, అధికారులతోగాని ప్రజలతోగాని జాగ్రత్తగా వ్యవహరించాలి. విద్యాభివృద్ధి, ఉద్యోగ ప్రయత్నాలు సరిగా జరుగవు. పెట్టుబడులకు సమయం కాదు. ఇతరులకు శారీరక సహాయం చేస్తారు. ప్రయాణాలలో ప్రయోజనం లేదు. వస్తువులు డబ్బు జాగ్రత్తగా కాపాడుకోవండి.



## కుంభం

(ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

అనుకొన్న దొకటి జరిగేది మరొకటిగా వుంటుంది. పనులు సవ్యంగా జరుగవు. ఉద్యోగులు, అధికారుల విషయంలో జాగ్రత్తపడాలి. ఆర్థిక ప్రగతి, రాబడి బాగుంటుంది. వారం మధ్యలో ఆరోగ్య లోపం కలుగుతుంది. మీకు మీ సన్నిహితుల మధ్య మస్పర్థలు కలిగించే వారుంటారు. విద్యాభివృద్ధి, వివాహ ప్రయత్నాలు అనుకూలించవచ్చు.



## మీనం

(పూర్వాభాద్ర 4పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ఆర్థికస్థితి, వృత్తి, వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. శ్రమ ఎక్కువగా ఉంటుంది. కండరాల నొప్పులు, ఉదరకోశ రుగ్మతలుంటాయి. కుటుంబ సభ్యుల మధ్య అసంతృప్తిని చూడవలసి ఉంటుంది. ఉద్యోగ నిర్వహణ బాగా సాగిపోతుంది. కొత్త పరిచయాలు, అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. సొంత పనులు బంధుమిత్రుల సహాయంతో జరిగిపోతాయి.

# జనవాణి

మూడవ పేజీ కొరవ

పార్టీలకు ఏ మాత్రం చిత్తశుద్ధి వున్నా 0శాతం స్థానాలైనా వారికి కేటాయించి ండేవారు.

నెల్లూరు వి. పద్మావతి

## తెలుగు కానరావడం లేదు

నవంబర్ 1తేది రాష్ట్ర అవతరణ నోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా రిగింది. దీనిలో ముఖ్యమంత్రి స్వయంగా ల్లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అంకిత వంతో పనిచేస్తున్న ఉద్యోగులను తన తుల మీదుగా సత్కరించారు. ఈ ందర్భంగా ఆయన చేసిన ఉపన్యాసంలో లుగు భాషాభివృద్ధికి తీసుకొంటున్న ర్యలిమిటో వివరించలేదు. ఎన్టీ రామారావు నిపోయాక తెలుగు భాష అభివృద్ధిని గూర్చి సుకోవాల్సిన చర్యలను అందరూ ర్చిపోయి నట్లున్నారు. భాషాభివృద్ధికి హర్నిశలు శ్రమిస్తుండే తమిళనాడు సిఎం రుణానిధిని ఈ విషయంలో చంద్రబాబు దర్శంగా తీసుకొంటే బాగుంటుంది. ంప్యూటర్లపై మోజుండే ముఖ్యమంత్రి లుగులో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తే అందరూ ంతోషిస్తారు.

నెల్లూరు వాస్తు రామచంద్ర

## సారాపై నిషేధం ఎవరికోసం?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ంత జిల్లాకు చెందిన మహిళా ఎమ్మెల్యేపై అక్రమ మద్యం కేసు నమోదు కావడంతో, సారా నిషేధం కొనసాగింపు ప్రజా ప్రతినిధుల కోసమా అనిపిస్తోంది. ఐఎంఎఫ్ లిక్కర్‌పై నిషేధం తొలగించి ప్రభుత్వానికి రాబడి పెంచా మంటున్నారు. మరి సారా నిషేధం కొనసాగిస్తూ ఎవరి జేబులు నింపుతున్నారు? సారా నిషేధ చట్టం కాగితాలకే పరిమితం. కానీ రాష్ట్రంలో అది ఎక్కడ దొరకడం లేదని? కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నిరుద్యోగులకు ఉపాధికల్పనకు దీన్ని విడిచిపెట్టినట్లుంది. మద్య నిషేధం సరిగ్గాఅమలు కావడం లేదనే కుంటిసాకుతో ఐఎంఎఫ్ లిక్కర్‌పై నిషేధాన్ని తొలగించిన చంద్రబాబు సారా నిషేధాన్ని మాత్రం ఎందుకు కొనసాగిస్తున్నారో అర్థం కావడం లేదు. హైటెక్ ముఖ్యమంత్రి పాలనలో అధికార పార్టీ ఎమ్మెల్యేపైనే అక్రమ మద్యం కేసు నమోదు కావడం కన్నా సిగ్గుచేటైన విషయం మరొకటుందా?

నెల్లూరు పి. సుహాసిని

## సంకీర్ణ ప్రభుత్వాలు ఏం వెలగబెట్టాయి?

రాజకీయ పార్టీలకు మరో మార్గాంతరం కనిపించక ప్రస్తుతం సంకీర్ణ ప్రభుత్వాల యుగం నడుస్తున్నదంటున్నారు. భారతదేశ ప్రజలు ఇప్పటి వరకు మూడు సంకీర్ణ ప్రభుత్వాలు చూశారు. ఈ ప్రభుత్వాల్లోని వ్యక్తులు వాళ్లలో వాళ్లు తన్నుకొని కాల గర్భంలో కలసి పోయారు. ప్రస్తుత మున్న వాజ్‌పేయి ప్రభుత్వం కూడా పెద్ద సంకీర్ణ ప్రభుత్వం. బిజెపి, కాంగ్రెస్‌లను సమాన శత్రువులుగా భావిస్తున్నప్పుడు బిజెపి కూటమి, కాంగ్రెస్ కూటమిగా చీలిపోయి రెండు బలమైన పార్టీలు ఏర్పడవచ్చుకదా? అది చేసుకోలేక దేశ ప్రయోజనాలతో చెలగాట మాడుతున్నారు.

నెల్లూరు కె. మురళి

## బాలకార్మికులు బతుకులు ఇంతేనా?

14ఏళ్ల వయస్సులోపు పిల్లలు పెద్ద పెద్ద కర్మాగారాల్లో సైతం పనిచేస్తూ, ముక్కుపచ్చలారని బాల్యానుభూతులను అనుభవించలేక పోతున్నారు. బాల కార్మికులను లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం పలు చట్టాలు రూపొందించినా అవి అమలుకు నోచుకోవడం లేదు. దీనివల్ల నేటి బాలలే రేపటి పౌరులన్న మాటకు అర్థం లేకుండా పోయింది. బిజెపి ప్రభుత్వం ఈ విషయంలో కాసింత కరకుగా వ్యవహరించి చట్టాలు నిక్కచ్చిగా అమలు పరచమని మనవి.

తాడూరు సి. గోవిందుడు చిత్తూరుజిల్లా

## గ్యాసుపంపిణీసరిగ్గాలేదు

నెల్లూరు టౌన్‌లో గ్యాస్ పంపిణీ సరిగ్గా జరగడం లేదు. నేను రెడ్డి అండ్ రెడ్డి గ్యాస్ కంపెనీలో అక్టోబర్ 6తేది గ్యాస్ బుక్ చేశాను. నాకు నవంబర్ 9తేది వరకు గ్యాస్ సిలిండర్ రాలేదు. కాని వివిధ దినపత్రికల్లో గ్యాస్ సమాచారం పేరిట వచ్చే శీర్షికలో అక్టోబరు 6, 8తేదీల్లో బుక్ చేసిన వారికి పంపిణీ చేసినట్లు వ్రాశారు. ఈ విషయమై ఏజన్సీకి వెళ్లి అడిగినా ప్రయోజనం లేదు. గ్యాస్ ఏజన్సీల వారు వినియోగ దారులతో ఆటాడు కొంటున్నా పట్టించుకొనే అధికారే లేకపోవడం బాధాకరం.

నెల్లూరు ఎం. సుబ్బయ్య

## కలియుగం అంతమై పోతుందా?

వారం వారం జమీన్‌రైతులో స్వయంపాకుల శ్రీనివాసులుగారు వ్రాసే పంచాంగం, వారఫలాలు చదవాలనిపిస్తాయి. జ్యోతిష్య శాస్త్రంపై పూర్తి పట్టు కలిగిన శ్రీనివాసులు కలియుగాంతంపై శాస్త్రాల్లో ఏం వ్రాసి వుందో ఒక వ్యాసంలో ప్రస్తావిస్తే బాగుంటుంది. పలువురు 1999వ సంవత్సరంలో కలియుగం అంతమై పోతుందంటున్నారు. యుగం అంతం కావడానికి మహా ప్రళయం, ప్రపంచ యుద్ధాలు జరిగే అవకాశం ఏదైన వుందా? చివరికి ఏ దేశాలు మిగులుతాయన్న విషయాన్ని కూడా ఆయన ఈ వ్యాసంలో చర్చించమని మనవి. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంలో కూడా 1999లోపే కలియుగం అంతమవు తుందని వ్రాసినట్లు కొందరు చెబుతున్నారు. ఇది ఎంత వరకు నిజం?

నెల్లూరు కె. కిరణ్మయి

## వ్యాపార సంస్థలుగా దేవాలయాలు!

మన రాష్ట్రంలోని దేవాలయాలు దేశవ్యాప్తంగా పేరొందినవి. అయితే ఈ దేవాలయాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం చూస్తుండడం వల్ల అవి వ్యాపార సంస్థలుగా మారిపోయాయి. పరమ పవిత్రమైన దేవాలయాల వద్ద చెప్పుల స్టాండు మొదలుకొని, పంచదార పొంగలి వరకు అన్నీ అమ్ముకొంటున్నారు. దర్శనానికి ఇచ్చే టిక్కెట్లలో ఎన్నో మతలబులు, టెంకాయ టిక్కెట్ల కథ చెప్పుకొంటూ పోతే చాంతాడంత అవుతుంది. అర్చన, హారతి పేరుతో బలవంతపు వసూళ్లు. తూతూ మంత్రాలు చదివి, కొన్ని దేవాలయాల్లో భక్తులను బెదరించి హుండీల్లో కానుకలు వేయిస్తున్నారు. భక్తులు కొట్టిన కొబ్బరి చిప్పలు భక్తులకు ప్రసాదంగా పెట్టాల్సింది పోయి అమ్ముకొని లాభాలు గడించడం ఏం న్యాయం? పైసా ఖర్చు కాకుండా పరమాత్మను దర్శింప జేసే దేవాలయాలే ఉత్తమోత్తమ దేవాలయాలనాలి.

నెల్లూరు జి. రామయ్య

# యాభై ఏళ్ల క్రితం

మూడవ పేజీ కొరవ

### కోవూరు, కంభం రైల్వే లైను

పానుగంటి రామానాయుడు మంత్రిగా నున్నప్పుడు కోవూరు, కంభం రైల్వే లైను ప్లాను వేయబడింది. ఈ ప్లానుకు ఎం.ఎస్.ఎం రైల్వే వారికి 60వేల రూపాయలు గూడా ఖర్చయిందట. గుర్తు రాళ్లు ఇప్పటికీ వున్నాయి. జిల్లాలోని ఆరుమెట్ట తాలూకాల వారు రైలు ముఖం ఎరుగరంటే ఎంతటి దౌర్భాగ్యమో చూడండి. ఒకవేళ ప్రజలు విజ్ఞానవంతులు, సుసంఘటితులు కానందున ఆందోళన చేసే శక్తి లేదనుకోండి, ఆ బాధ్యత వారిని పాలించే జాతీయ ప్రభుత్వంపై లేదా? దాదాపు 6 లక్షల ప్రజలు ఎలాంటి రహదారి సౌకర్యాలు లేక వెనుకబడి వుంటే చూస్తూ వూరుకోవడం ప్రజా ప్రభుత్వానికి ధర్మమా?

# నెల్లూరుసంగతులు

4వ పేజీ కొరవ

వాసులు మరుగుదొడ్లు నిర్మించుకోవాలని. దాని కోసం లబ్ధిదారులు చెల్లించాల్సిన 200 రూపాయలు తానే చెల్లిస్తానని చంద్రమోహన రెడ్డి హామీ కూడా ఇచ్చారు.

## నెహ్రూకు నివాళి

14తేది నెహ్రూ జయంతిని పురస్కరించుకొని పలువురు నాయకులు మద్రాసు బస్టాండ్ వద్దగల నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ తరపున సివి.శేషారెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, దేవకుమార్‌రెడ్డి, కెవి. సుబ్బారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి శ్రీలక్ష్మి, జంట మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పరసా రత్నం, ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, వేనాటి మునిరెడ్డి, జిల్లా పార్టీ పరిశీలకుడు జల్లి సిద్ధయ్య, నెహ్రూకు నివాళులర్పించిన వారిలో వున్నారు.

## బాక్స్‌టైపు బ్రిడ్జి తీసిన ప్రాణం!

విజయమహల్ గేటు వద్ద బాక్స్‌టైపు బ్రిడ్జిని ఏ ముహూర్తంలో ప్రారంభించారో కాని ఏళ్ల తరబడి ఆపని పూర్తి కాకుండానే, కొనసాగుతూంది. ఈ మధ్య కురిసిన వర్షాలకు నీళ్లతో నిండిన ఈ బ్రిడ్జిలో, 12తేది రాత్రి ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి రంగారావు (55) అనే వ్యక్తి మరణించాడు. మనిషి మునిగే పోయే లోతున్న చోట మునిసిపాలిటీ ప్రమాద హెచ్చరికలేవీ పెట్టనందున ఓ నిండు ప్రాణాన్ని బ్రిడ్జికి బలివ్వాల్సి వచ్చింది. ఈ బ్రిడ్జిపై అలుపెరుగని పోరాటం చేస్తున్న సిపిఎం కౌన్సిలర్ వున్నం బసవయ్య 14తేది పార్టీ కార్యకర్తలతో మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి కమీషనర్ డాక్టర్ శ్రీనివాసులు, ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి లను ఈ విషయమై ఘెరావ్ చేసి వచ్చారు.

## నెల్లూరు నేత్రదాతల సంస్థ ప్రగతి

నెల్లూరు నేత్రదాతల సంస్థ పుట్టి నవంబర్ 15తేదికి 12 ఏళ్లయ్యింది. సంస్థ ఈ 12 ఏళ్లలో 38 మంది నేత్రదాతల నుంచి 75 కళ్లను సేకరించి, మద్రాసులోని ప్రభుత్వ నేత్ర వైద్యశాల నేత్రనిధికి బహూకరించినట్లు సంస్థ కార్యదర్శి తిక్కవరపు సుకుమార్‌రెడ్డి చెప్పారు. 97 నవంబర్ 16 నుంచి 98 నవంబర్ 15 వరకు సంస్థ బుచ్చిరెడ్డిపాళానికి చెందిన పాటూరు సుబ్బమ్మ, నెల్లూరు లక్ష్మీనరసింహ పురానికి చెందిన చుక్కపల్లి వరలక్ష్మమ్మ, బాలాజీనగర్ నివాసి పివిఎన్. కోదండరామ్‌ల నేత్రాలు మాత్రమే సేకరించ గలిగినట్లు వివరించారు. నేత్రదాన ఉద్యమానికి జిల్లా ప్రజలు ఎంతగానో సహకరిస్తున్నట్లు తెలిపారాయన.

## ఎసినగర్ హైస్కూల్‌లో బాలల దినోత్సవం

ఎసి నగర్ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సత్యనారాయణ మూర్తి ఘనంగా జరిపించారు. వ్యాపారవేత్త, కనుమర్లపూడి తిరుమలరావు, అడ్వొకేటు రామచంద్రరావు, పిఎస్. శాంత, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పి. ప్రభాకరరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి, సందేశాలిచ్చారు. వివిధ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతు లందించారు.

పాటల పోటీల్లో చక్కని ప్రతిభ చూపిన అరుణ, నూరం భ్రమ రాంబికను పలువురు ప్రశంసించారు. హైస్కూల్ ఉపాధ్యాయుడు వి. గురునాథ రావు ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం నిర్వహించారు.

# మిర్చి

4వ పేజీ కొరవ

అమ్ముతున్న మిర్చి, 16 రూపాయలకిస్తున్న ఎర్రగడ్డలు క్వాలిటీవి కావు. ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా మంచి సరకు అమ్మించడంతో పాటు, ఈ రెండు వస్తువుల కోటాను కూడా పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## 3గంటల దాటాకే నెల్లూరులోఉల్కాపాతం!

పత్రికలు, టివిలు 17తేది పెద్ద ఎత్తున ఉల్కాపాతం సంభవిస్తుందని చేసిన ఊదరగొట్టే ప్రచారం, నెల్లూరు టౌన్ ప్రజలకు ఆ రాత్రి నిద్ర లేకుండా చేసింది. ఆకాశంలో అరుదుగా కనిపించే ఈ వింతను కనులారా చూసేందుకు యువకులు, మహిళలు నిశిరాత్రిని సైతం లెక్క చేయక మిద్దె లెక్కారు. 12 గంటల నుంచే ఆకాశంలోని నక్షత్ర మండలాలను చూస్తూ ఎవరికి తోచినట్లు వారు వ్యాఖ్యానాలు చేసుకోసాగారు. టెంపుల్ టటిల్ తోక భాగంలోని లియోనిడ్స్ భూ కక్ష్యలో ప్రవేశించక ముందే హరనాథపురంలోని రత్నం, నారాయణ కోచింగ్ సెంటర్ల విద్యార్థులు మూడంతస్తుల మిద్దెల పైకెక్కి పెట్టిన కేకలు, పడమర వైపున విఆర్‌కాలెజి వరకు, తూర్పున వావిలేటిపాడు గ్రామం వరకు వినిపించాయి. టెంపుల్ టటిల్ ప్రజల సహనాన్ని పరీక్షించను కాబోలు అంత త్వరగా భూమిని తాకినట్లనిపించలేదు. అర్థరాత్రి దాటాక ఒంటి గంట 20 నిమిషాలకు ఈశాన్యం నుంచి నైరుతీ దిశగా ఒకసారి ఆకాశంలో వెలుగు రువ్వింది. తరువాత రెండు గంటల వరకు చిన్న, చిన్న కాంతి పుంజాలే. 3 గంటలు దాటాక ఉల్కాపాతాన్ని నెల్లూరు పట్టణ ప్రజలు కనులారా చూడగలిగారు. ఆకాశంలో అప్పుడప్పుడు వెళ్తుండిన హైదరాబాద్, మద్రాసు విమానాలను చూసి కొందరు ఉల్కలని భ్రమ చెందారు. టెంపుల్ టటిల్ దయతలచి వెలుగులు మినహా నెల్లూరీయులపై రాళ్లు రువ్వకపోవడం విశేషమనాలి.*

# ట్రాఫిక్

4వ పేజీ కొరవ

అధికారులు ఒక బండి ఇసుక, మరో బండి పనికిరాని రాళ్లు తెప్పించారు. పని చేస్తున్నామన్నట్లు 12 గంటల ప్రాంతంలో కలెక్టరేట్‌లోని వుద్యోగులంతా ఈ నాలుగు గుంటలు పూడ్చే కార్యక్రమానికి తరలి వచ్చారు. కాని అటు డిఆర్వో వెంకటేశ్వర్లు గాని, హుజూర్‌శిరస్‌దార్ శ్రీనివాసరావు గాని పలుగు, పార, తట్ట, బుట్ట చేత పట్టలేదు. వారి మార్గాన్నే ఇతర వుద్యోగులు అనుసరిస్తూ సూపర్‌వైజర్ల పాత్ర నిర్వహిస్తే, కలెక్టరేట్‌లోని క్రింది స్థాయి ఉద్యోగులిద్దరు మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ గుంటలు పూడుస్తూ కనపడ్డారు. టిప్‌టాప్‌గా తయారై వచ్చిన కలెక్టరేట్‌లోని వుద్యోగులు క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగమైన గదులు, టేబుళ్లు, అల్మారాలు, వరండాలు, కారిడార్లు శుభ్రపరుస్తారా? పనికిమాలిన ఫైళ్లను చుట్టి రికార్డు రూముల్లో పెడతారా? ఈ మధ్య నాటిన మూడు కోట్ల మొక్కలకు నీళ్లు పోస్తారా? ఎవరి కళ్లనీళ్లు తుడవడానికీ కార్యక్రమం!

# చిత్రసమీక్ష

9వ పేజీ కొరవ

భారంతో కమల్ వదిన ఆత్మహత్య చేసుకుంటుంది.

జైల్లో వున్న కమల్‌కు నలుగురు ఖైదీలు స్నేహితులవుతారు. వారి సహాయంతో కమల్ జైలు నుంచి పారిపోయి తన అన్న మీద తన మీద దుర్మార్గాలు జరిపిన విలన్లను హతమారుస్తాడు. ఇది కథకు గమ్యం.

కథలో ఏ పాత్రా చెప్పుకోతగింది లేదు. హీరో కమల్ పాత్రలో ఎక్కడా వైవిధ్యం కనిపించదు. ఆపాత్రపోషణలో శ్రీకాంత్ పరవాలేదని పించారు. హీరోయిన్ రూప పాత్ర ఆటకు పాటకు సరిపోయింది. ఆ పాత్రలో రవళి ఆటబొమ్మలా కనిపించింది. శరత్‌బాబు, గీతలు పోషించిన, అన్న, వదిన పాత్రలూ అంతంత మాత్రంగానే వున్నాయి. ప్రధాన విలన్‌గా కోట శ్రీనివాసరావుకు ఇది రొటీన్ పాత్ర. తన మామూలు ధోరణిలోనే గట్టెక్కాడు. బ్రహ్మానందం పోషించిన హాస్యపాత్ర అపహాస్యంగా వుంది.

# సినిమా

9వ పేజీ కొరవ

కొత్త కథను రూపొందించు కొన్నారు. 'హౌస్‌ఫుల్'గా పేరుపెట్టిన ఈ చిత్రాన్ని మధురైలోని శ్రీదేవి టాకీసును నెల రోజులు లీజుకు తీసుకొని నిర్మిస్తూ బిజీగా వున్నారు.

## భానుచందర్ కంప్యూటర్ చెస్ బోర్డు

షూటింగ్, షాట్ గ్యాప్‌లో హీరో భానుచందర్ ఒక్కడే కూర్చొని చదరంగం (చెస్) ఆడుకొంటుంటాడు. ఒంటరిగా కూర్చొని చెస్ ఎలా ఆడతారని సందేహం కలగవచ్చు. అది కంప్యూటర్ చెస్ బోర్డుతో సులభంగా సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని భానుచందరే స్వయంగా చెబుతూ చిన్నప్పటి నుంచి నాకు చదరంగం ఆడడమంటే ఇష్టం. షూటింగ్‌లో ఎవరి పనిలో వాళ్లుంటారు. తీరిక దొరికినప్పుడు మెదడులోనికి పనికిమాలిన ఆలోచనలు ఎందుకు రానివ్వాలి. అందుకే చదరంగంతో కాలం గడుపుతానన్నారు.

# కక్షగట్టి

4వ పేజీ కొరవ

14 జిల్లా జట్టును 22తేది నెల్లూరు ఆర్‌ఎస్‌ఆర్‌ఎం. హైస్కూల్‌లో ఎంపిక చేస్తారు. ఆసక్తి గలవారు స్కూల్ ప్రధానోపాధ్యాయుల నుండి తాము చదివే క్లాసు వివరాల ధృవీకరణ పత్రంతో ఈ కార్యక్రమానికి హాజరు కావచ్చని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి బి. అజిత్‌బాబు కోరుతున్నారు.

## బాలాజీ లాకర్స్ స్కూల్‌లో కళాకృతులు

నెల్లూరు రోహిణీ నగర్‌లోని బాలాజీ లాకర్స్ ఎడ్యుకేషనల్ అకాడమీలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ పిల్లల నుద్దేశించి కళాశాల కరస్పాండెంటు పి. పార్థసారథి మాట్లాడుతూ చాచా నెహ్రూ చిన్న పిల్లల్లో సృజనాత్మక శక్తి పెరిగేలా విద్యాబోధన ఉండాలని పరితపించారు. ఆ బాటలోనే తమ స్కూల్‌లో నేటితరం విద్యార్థులకు కావాల్సిన ఆధునిక విద్యావసతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం స్కూల్ విద్యార్థులు తయారు చేసిన వివిధ కళాకృతుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు స్వంతంగా తయారుచేసిన 300 కళాకృతుల్లో వివిధ దేవతారూపాలు, జంతువులు, స్వర్ణాంధ్రప్రదేశ్, క్లీన్ అండ్ గ్రీన్ నమూనాలు, ఇండియా పటం, తాజ్‌మహల్ వంటివి వున్నాయి. వీటిలో ఉత్తమమైనదిగా 8వ తరగతి విద్యార్థి విఘ్నురాజ్ తయారు చేసిన కళాకృతిని ఎంపిక చేశారు. ప్రదర్శనను పలువురు ప్రజలు సందర్శించారు. అకాడమీ ప్రిన్సిపల్ ఎన్. రమేష్, మేనేజర్ సుబ్రహ్మణ్యం, ప్రదీప్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నెల్లూరు సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో విద్యా వైజ్ఞానిక సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీలక్ష్మి, ప్రక్కన వనమూలికా ఇంధన సృష్టికర్త రామర్‌పిళ్లై, డి. నరసింహులు, డిఇఓ. రామలింగం

# ఆర్థిక మాంద్యం

2వ పేజీ కొరవ

స్పెక్యులేషన్ ఏ మేరకు వుంటుందనే విషయాన్ని అంచనా వేయలేకున్నారు.ఈ డబ్బును మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ద్వారా అక్రమంగా సంపాదించిందనవచ్చు. దీనికి అధికలాభాలంటే 25 శాతం నుంచి 40 శాతం వచ్చే వాటిలో పెట్టుబడి పెట్టేందుకు దీని స్వంతదారులు ప్రయత్నిస్తుంటారు. పరిశ్రమల్లో ఇటువంటి డబ్బును పెట్టుబడిగా పెడితే కేవలం 12శాతం మించి లాభాలు రావని ఈ వ్యాపారం చేసే వారికి తెలుసు. అదీగాక గ్లోబలైజేషన్, ఆర్థిక సంస్కరణలనే నినాదాలను బాగా వాడుకొని స్పెక్యులేషన్ ద్వారా వ్యాపారం చేసి సంక్షోభాన్ని సృష్టిస్తున్నారు.

అమెరికా నుంచి పెట్టుబడులు తరలిపోకుండా ఆ దేశం వడ్డీ రేట్లను బాగా పెంచాలనే విషయాన్ని ఆలోచిస్తుంది. ఇదేగాని జరిగితే మన దేశానికి కొత్త పెట్టుబడులు ఆగిపోతాయి. ఈ దశలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. అమెరికా, మన దేశం అణుపరీక్షలు జరిపాక విధించిన ఆంక్షల కంటే, విశ్వవ్యాప్తంగా వున్న ఆర్థిక మాంద్య పరిస్థితి గూర్చి కేంద్ర ప్రభుత్వం జాగరతతో పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇపుడున్న పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే, 1999 - 2000 వేల సంవత్సరాల మధ్య మనదేశ ప్రజల్లో కూడా కొనుగోలు శక్తి పూర్తిగా నశించి పోతుంది. 1930 ప్రాంతంలో అప్పటి ప్రజలు అనుభవించిన దుస్థితిని ఇప్పటి తరం కూడా అనుభవించాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈ విషయమై ముందు నుంచి మేలుకోవడం మంచిది.

**జమీన్‌రైతు**

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ.100లు |
| విడిప్రతి | రూ.2లు |

**సర్వేచేయబడును**

నెల్లూరు టౌన్‌లో, నెల్లూరు జిల్లాలో పొలములు, ఇండ్ల స్థలములు కొలిచి, ప్లాన్లు తయారు చేసి యివ్వబడును. సంప్రదించండి:

**డి. సూర్యప్రకాశరావు**
రిటైర్డ్ సర్వేయరు
రాజరాజేశ్వరి దేవాలయం
ఎదురుగా, మొదటి క్రాస్,
మొదటి ఇల్లు మిద్దెపైన
రెవిన్యూ కాలనీ, నెల్లూరు - 4

ముసునూరువారిపాళెం PACS
Regd. No. K - 572
ముత్తుకూరు మండలం, నెల్లూరు జిల్లా

**ప్రకటన**

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో గల బ్రహ్మదేవి కాపురస్తులు (1) నాపా పెద పెంచలయ్య గారి కుమారుడు రామమూర్తి, (2) కొలమల కృష్ణయ్య గారి భార్య కాంతమ్మ, ముసునూరువారిపాళెం PACS నందు చేపల గుంటల కొరకు జాయింటుగా అప్పు దరఖాస్తు చేసియున్నారు. ఈ అప్పుకుగాను నెల్లూరుజిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిష్టరు కాబడిన డాక్యుమెంట్ నం.(1) 356/1973, తేది 7.5.1973 మరియు (2)1245/1975, తేది 22.5.1975ర్లు ప్రకారం క్రింద తెలుపబడిన ఆస్తిపై సదరు ఇద్దరు హక్కు కలిగి యున్నారు. గ్రామ లెక్కల దాఖలా సర్వే నం. 546లో య1-08 సెంట్లు, 552లో య1-44 సెంట్లు; (2) మార్పుదల పత్రం సర్వే నం.872-Aలో య1-10 సెంట్లు, 872-Eలో య0-36 సెంట్లు ఆస్తిని హామీగా చూపి వున్నారు. సదరు దస్తావేజులు పోయినందున నకలు పత్రములు దాఖలు చేసియున్నారు. ఈ ఆస్తిని తాకట్టు పెట్టుకొనుటకు ఎవరికైనా ఏ విధమైన ఆక్షేపణ వున్న యడల ఈ ప్రకటన వెలువబడిన 10 రోజులలోగా మా సంఘము వారికి తెలియజేయ వలసినదిగా కోరడమైనది.

యం. సుబ్బరామిరెడ్డి - ప్రెసిడెంటు
సి.హెచ్. బుజ్జయ్య - కార్యదర్శి

## కావలి

5వ పేజీ తరువాయి

నాయకులు, కుల సంఘాల నాయకులు అండగా వుండడంతో అక్కడి వారు తాము ఆక్రమించుకొన్న స్థలాన్ని ఖాళీ చేయక పోవడంతో ప్రహరీ నిర్మాణం ఆగిపోయింది. పరిస్థితిని అర్థం చేసుకొన్న ఆర్డీఓ సమస్యను కలెక్టర్‌కు విన్నవించగా ఆమె దూరదృష్టితో ఆలోచించి గూడూరులో నిర్మించిన ఆడిటోరియం వలె, మినీ స్టేడియం నిర్మాణానికి అనుమతి యిస్తామన్నారు. జన్మభూమి నిధులతో నిర్మించే విధంగా ప్రభుత్వం నుంచి 15 లక్షల రూపాయలు మంజూరు చేస్తానన్నారు. మొత్తం 25 లక్షలు ఖర్చయ్యే ఈ నిర్మాణానికి, మిగిలిన 10 లక్షలు యిచ్చే దాతలు ముందుకు వస్తే వారి పేరు మీదుగానే స్టేడియం నిర్మాణం మొదలు పెట్టు కొనేందుకు అభ్యంతరం లేదని చెప్పినట్లు తెలిసింది. ఎవరైనా దాతలు ముందుకు వస్తే కావలిలో బ్రహ్మాండమైన స్టేడియం రూపుదిద్దుకొని, ఆట స్థలాల కొరత తీరిపోతుంది. ఈ ప్రతిపాదనను కలెక్టర్‌గాని, ఆర్డీఓగాని పత్రికాముఖంగానో, బహిరంగం గానో వెల్లడి చేయనందువల్ల ఈ విషయం మరుగున పడివుంది. వారు కాసింత చొరవ చూపిస్తే కావలీయులు పది కాలాల పాటు వారి పేరు చెప్పుకొంటారు.

## జిల్లావార్తలు

5వ పేజీ తరువాయి

మారినవారైతే విద్యా వ్యవస్థ ఈ విధంగా దిగజారి పోతుంది.

## నార్తురాజుపాళెం వర్తక సంఘం

కొడవలూరు మండలం నార్తు రాజుపాళెంలోని అన్ని వ్యాపారాలు చేసుకొనే వ్యాపారులంతా కలిసి ఒక వర్తక సంఘాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. ఈ సంఘం గౌరవాధ్యక్షునిగా బి. శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షునిగా ఎం. రాఘవరావు, ఉపాధ్యక్షులుగా పి. వెంకటరత్నం, బి. శ్రీనివాసులురెడ్డి; కార్యదర్శిగా ఎస్. క్రిష్ణయ్య, సహకార్యదర్శులుగా సి. శ్రీనివాసులురెడ్డి, కె. శ్రీనివాసులు; కోశాధికారిగా పి. వేణుగోపాలరావులను ఎన్నుకొన్నారు. వీరుగాక మరో 23 మంది కార్యవర్గ సభ్యులు కూడా ఈ సంఘంలో వున్నారు.

## వార్డెన్

5వ పేజీ తరువాయి

క్లబ్ గ్రామంలోని అన్ని స్కూళ్ల పిల్లలకు కలిపి చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించింది. పోటీల్లో గెలిచిన పిల్లలకు హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో హెడ్మాస్టర్ అబ్బతుల్లా చేతుల మీదుగా బహుమతులు అందించింది. క్లబ్ అధ్యక్షుడు ఎ. సురేష్, కార్యదర్శి ఎ. జగదీష్‌బాబు స్పోర్ట్స్ వింగ్ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు.



10వ తరగతి పరీక్షలలో రాష్ట్రంలో 3వ ర్యాంకు సాధించిన నెల్లూరు సంఘమిత్ర హైస్కూల్ విద్యార్థి సిహెచ్ శేషమాధవ్‌ను హైదరాబాదులో ఇటీవల జరిగిన కార్యక్రమంలో సత్కరిస్తున్న ముఖ్యమంత్రి, ప్రక్కన ప్రాథమిక విద్యామంత్రి వెంకటరమణ

## రాపూరు

5వ పేజీ తరువాయి

వాగ్దానాన్ని ఎమ్మెల్యే మరచిపోవడాన్ని ప్రజలు చర్చించుకొంటున్నారు. ఇక్కడ ఒక ప్రజా వుద్యమాన్ని రూపొందించాలని కొందరు యువకులు ప్రణాళికలో వున్నారు.


**VISIT**

www nellore.com

for total information on Nellore District

**బలాది లేహ్యం**

నరముల బలహీనత, గుండె దడ, ఆయాసము, బ్లడ్‌ప్రెషర్ మొదలగు వ్యాధులపై పనిచేయును. జీర్ణశక్తి, రక్తపుష్టి, బలము, ఉత్సాహమును కలిగించును. 200 గ్రాముల సీసా రూ.56లు. **మారుతి దంత చూర్ణం** దంతములు కదులుట, చిగురు వాపు, నొప్పులను నివారించును 30 గ్రాములు రూ.12లు మాత్రమే.

జనార్ధన ఆయుర్వేద ఫార్మశి
4/607, ఉస్మాన్‌సాహెబ్‌పేట
నెల్లూరు 524 002


**HOMAGE**



Born : 11-8-1948 Died : 8-11-1998

**Dr. K. BALA SUBRAHMANYAM**

B.E.,M.Sc (Engg.), Ph.D., M.A.I.S.I., F.I.E.,
Professor of Mechanical Engg
N.B.K.R. Institute of Science & Technology

*"A personality who is a rare combination of excellent teacher, brilliant researcher and the one who has given utmost importance to the basic values."*


The Management, Staff and Students
N.B.K.R. Institute of Science & Technology
Vidyanagar - 524 413, Nellore Dt., A.P.


**జమీన్‌రైతు**

పొగతోట, నెల్లూరు 524 001

**ఒకే చందాతో రెండు కానుకలు**

**రూ.100లు చందాగా చెల్లిస్తే సంవత్సరం పాటు మీ ఇంటికి జమీన్‌రైతు వారపత్రిక**











**దానితోపాటు రూ.100లు విలువ కలిగిన ఈగల్ వాక్యూమ్ ఫ్లాస్క్ కానుక**

**అదనంగా బంగారు నెక్లస్, జత బంగారు గాజులు గెల్చుకొనే అవకాశం**

**మీరు చేయవలసిందల్లా...**

- రూ.100లు చెల్లించి జమీన్‌రైతు చందాదారులుగా చేరండి.
- మీకుగాని, మీరు సూచించిన మీ స్నేహితులు, బంధువులకు కాని - వారు దేశంలోని ఏ నగరంలో వున్నాసరే - వారం వారం జమీన్‌రైతు సరఫరా జరుగుతుంది.
- రెండు వారాలలోగా రూ.100లు విలువ కలిగిన ఈగల్ కంపెనీ వాక్యూమ్ ఫ్లాస్క్ కానుక మీ ఇంటికి చేరుతుంది! అంటే, మీరు చెల్లించే చందా మొత్తం మీకు తిరిగి వచ్చేస్తుందన్నమాట; పత్రిక ఉచితమని అర్థం!
- బంపర్ డ్రాలో ఇద్దరు విజేతలకు ఒక బంగారు నెక్లస్, జత బంగారు గాజులు బహుమతిగా అందజేయబడుతాయి.
- 1.12.1998 నుంచి 1.4.1999 మధ్య చందాదారులుగా చేరే కొత్తవారికి, రెన్యువల్ చేసుకొనే పాత చందాదారులకు కూడా ఈ కానుకలు, బంపర్ డ్రా అవకాశం కల్పించ బడతాయి.
- తమ బంధువులు, స్నేహితుల కోసం ఒకరు ఎన్ని చందాలైనా చెల్లించవచ్చు. వారందరికీ పత్రిక పంపుతాము; ఈగల్ వాక్యూమ్ ఫ్లాస్క్ కానుక మాత్రం చందా చెల్లించే వారికి అందజేస్తాము; దానితో పాటు వారు బంపర్ బహుమతికి అర్హత పొందుతారు. ఇతర నగరాలు, రాష్ట్రాలలో వుండేవారికి అదనపు పోస్ట్ ఖర్చులు కూడా మేమే భరిస్తాం.
- అమెరికా, ఇంగ్లాండ్ వంటి విదేశాలలోని స్నేహితులు, బంధువులకు పత్రిక పంపాలంటే మాత్రం పోస్ట్ ఖర్చు అదనంగా చెల్లించాలి.

**నెల్లూరీయులు గర్వపడే నెల్లూరు జిల్లా సమాచార దర్పణం జమీన్‌రైతు**


Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. Offset Printing at Aruna Graphics, Nellore